**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 సంచిక : 304 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ శుక్రవారం 27 మార్చి 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


- మార్కాపురం శివారులో టిప్పర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఐదు నెలల పసికందు సహా 14 మంది సజీవ దహనం
- 29 మందికి గాయాలు
- గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన మృతదేహాలు
- డీఎన్ఏ పరీక్షలు చేయించి బంధువులకు అప్పగించేందుకు ఏర్పాట్లు
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల పరిహారం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- ఘటనా స్థలానికి మంత్రులు అనిత, రాంప్రసాద్‌రెడ్డి


# బతుకులు బుగ్గి

వారంతా ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని వెళ్లారు. శ్రీరామనవమి పండగ ఉందని సొంతూళ్లకు బయల్దేరారు. మరో రెండు గంటల్లో గమ్యస్థానం చేరిపోయేవారే.. అంతలో ఉన్నట్టుండి పెద్ద శబ్దం.. మంటలు.. పొగ.. చేతనైన వాళ్లు అద్దాలు పగలగొట్టి కిందకి దూకేశారు. ఈలోపే అగ్నికీలలు చుట్టుముట్టాయి.. 14 నిండుప్రాణాలు బుగ్గయిపోయాయి!!

తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరికి వెళ్తున్న హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు... మార్కాపురం శివారు రాయవరం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగి 14 మంది సజీవ దహనమయ్యారు. వీరిలో ఆరుగురు మహిళలు, ఐదు నెలల చిన్నారి ఉన్నాడు. డ్రైవర్ సహా 29 మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన 14 మందిని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. వేకువజామున 5.40 గంటల సమయంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని, తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నవారికి రూ.2 లక్షల చొప్పున సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

- మిగతా2లో





## నదిలో మునిగిన బస్సు.. బంగ్లాదేశ్‌లో 24 మంది మృతి

నదిలో పడిపోతున్న బస్సు


బంగ్లాదేశ్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తోన్న బస్సు.. పద్మానదిలో పడిపోవడంతో 24 మంది మృతిచెందారు. కొందరు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకొని ప్రాణాలు కాపాడుకున్నారు. మరికొంతమంది గల్లంతయ్యారు. బస్సు నుంచి 22 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. వారిలో 11 మంది మహిళలు, ఆరుగురు పురుషులు, ఐదుగురు పిల్లలున్నారని పోలీసులు తెలిపారు. ఢాకాలో ఈద్ వేడుకలను పూర్తిచేసుకొని బుధవారం సాయంత్రం తిరిగి వస్తుండగా రాజ్‌బరి జిల్లాలోని దౌలత్‌దియా టెర్మినల్ దగ్గర దుర్ఘటన

- మిగతా2లో

# అమరావతికి చట్టబద్ధతపై 28న తీర్మానం

- అదే రోజు కేంద్రానికి..
- వీలైతే ఏప్రిల్ 2నే పార్లమెంటులో బిల్లు
- అమరావతి కేవలం రాజధానే కాదు.. ప్రజల భావోద్వేగం
- మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు





అమరావతిని దెబ్బతీసేందుకు జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో చేసిన కుట్రలు, అప్పట్లో మంత్రులు, వైకాపా నాయకులు అమరావతిపై పదే పదే విషం కక్కడం, రాజధానిని కాపాడుకోవడానికి రైతులు చేసిన ఉద్యమాన్ని అణచివేసేందుకు సాగించిన దమనకాండను ప్రజల ముందుంచాలని మంత్రిమండలి నిర్ణయించింది. విజయవాడ- గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో ప్రకటిస్తే... అప్పట్లో విపక్షనేతగా జగన్ దాన్ని సమర్థించారని, వైకాపా అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల పేరుతో నాటకానికి తెర తీశారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై శనివారం శాసనసభలో చర్చించి, తీర్మానం చేయాలని సీఎం పేర్కొన్నారు. తీర్మానం ఆమోదించి అదే రోజు కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే, ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ ముందుకు తెస్తారని, వీలైతే ఏప్రిల్ 2న పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే అవకాశముందని సీఎం వివరించారు. గురువారం మంత్రివర్గ సమావేశంలో ప్రధానం గా రాజధానిపైనే చర్చ జరిగింది. ఎజెండాలో రాజధాని అమరావతి 23వ అంశంగా ఉన్నప్పటికీ, దానిపైనే మొదట చర్చించారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో శాసనసభలో జరిగిన పరిణామాలను అప్పట్లో స్పీకర్‌గా ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. మనోహర్ అప్పట్లో చాలా పోరాడారని, స్పీకర్ హోదాలో ఆయనకు కొన్ని పరిమితులుంటాయి కాబట్టి వాటికి కట్టుబడి ఉండాల్సి వచ్చిందనుకుంటానని సీఎం వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే ఏకైక రాజధాని అంటూ తీర్పు చెప్పిన హైకోర్టు న్యాయమూర్తులు

- మిగతా2లో



## అమరావతికి చట్టబద్ధతపై తీర్మానం

- విభజన చట్టాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరాలి
- అందుకోసం అసెంబ్లీలో తీర్మానం
- క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం–2014లోని సెక్షన్ 5ను సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏపీ అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ సవరణ ప్రతిపాదనల కింద సెక్షన్ 5లోని సబ్ సెక్షన్ 2లో అమరావతి అనే పదం ఉన్న చోట 'ఎట్ అమరావతి' చేర్చాలని, సెక్షన్ 5 వివరణకుగాను అమరావతి అంటే 'ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) చట్టం–2014 కింద నోటిఫై చేసిన రాజధాని నగర ప్రాంతాలు కలిసుంటాయి' అనే దాన్ని చేర్చాలనే తీర్మానానికి అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో

- మిగతా2లో



## నేపాల్ నూతన ప్రధానిగా బాలేంద్ర షా

నేపాల్ నూతన ప్రధానిగా బాలేంద్ర షా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ పార్లమెంటరీ నేతగా గురువారం ఎన్నికయ్యారు. దీంతో హిమాలయ దేశ ప్రధాని పగ్గాలు చేపట్టిన యువ నేతగా ఘనత సాధించనున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ఆయన.. మాధేశ్ ప్రాంతం నుంచి అత్యున్నత పీఠం అధిరోహించిన వ్యక్తిగానూ రికార్డు నెలకొల్పనున్నారు. సుదీర్ఘ కాలంగా రాజకీయ అనిశ్చితి ఎదుర్కొంటున్న నేపాల్‌లో.. జెన్-జీ తిరుగుబాటు అనంతరం

- మిగతా2లో



## ప్రతి గ్రామంలో తెలుగుదేశం జెండా ఎగరాలి

అమరావతి: ఈ నెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవం అన్నిచోట్లా పండుగలా చేయాలని మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో తెలుగుదేశం జెండా ఎగరాలన్నారు. క్యాబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో నారా లోకేశ్ విడిగా భేటీ అయ్యారు. సీనియర్ నేతలను సన్మానించి వారితో మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి భోజనం చేయాలన్నారు. అర్హులందరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుందామన్నారు.

- మిగతా2లో

## 7 నగరాల్లో 10 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు

- పైపులైన్ల తవ్వకానికి వెంటనే అనుమతులు
- దరఖాస్తుచేస్తే 24 గంటల్లోనే కనెక్షన్
- పీఎన్‌జీకి మారినా దీపం-2 కింద ఏడాదికి రూ.2,400 రాయితీ
- పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్



- మిగతా2లో

## ఇరాన్ నుంచి మాకు గిఫ్ట్ వచ్చింది... 10 చమురు ట్యాంకర్లను పంపించింది

- పశ్చిమాసియాను ఇరాన్ స్వాధీనం చేసుకోవాలనుకుందన్న ట్రంప్
- అమెరికా అడుగుపెట్టేసరికి వారికి కష్టంగా మారిందన్న ట్రంప్
- ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఒమన్ దేశాలను లక్ష్యంగా చేసుకుందన్న ట్రంప్
- యుద్ధం ప్రారంభానికి ముందే క్షిపణులు గల్ఫ్ దేశాల వైపు గురి పెట్టి ఉన్నాయని ఆరోపణ

- మిగతా2లో



## పవన్ కల్యాణ్‌ను కలిసిన యంగ్ బైకర్ తాప్సీ ఉపాధ్యాయ...

- ఒబేసిటీ ముక్త్ భారత్ యాత్రపై బైకర్ తాప్సీ ఉపాధ్యాయ
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మంగళగిరిలో సమావేశం
- ఇప్పటివరకు 17,400 కి.మీ. ప్రయాణించి 16 రాష్ట్రాలు పూర్తి
- తాప్సీ యాత్ర యువతకు స్ఫూర్తి కావాలన్న పవన్ కల్యాణ్

దేశవ్యాప్తంగా ప్రజారోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఒంటరిగా బైక్‌పై యాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువతి తాప్సీ ఉపాధ్యాయను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. "ఒబేసిటీ ముక్త్ భారత్ –

- మిగతా2లో



# బతుకులు బుగ్గి

**బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం**

రోడ్డుకు ఎడమవైపు వెళ్లాల్సిన బస్సు డ్రైవర్.. మూలమలుపు వద్ద నిర్లక్ష్యంగా కుడివైపు వెళ్లి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టాడు. టిప్పర్ డీజిల్ ట్యాంకు పగిలిపోవడంతో మంటలు రేగి ప్రమాద తీవ్రత పెరిగింది. 28 మంది ఎలాగోలా బస్సు అద్దాలు పగలగొట్టి దూకేసి.. ప్రాణాలు కాపాడుకున్నారు. పైనుంచి దూకినవారిలో కొందరికి ఎముకలు విరిగాయి. మరికొందరికి కాలిన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 14 మందిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతదేహాలను మార్కాపురం మార్చురీకి తరలించారు. ప్రయాణికుల జాబితాను బట్టి మృతులెవరనేది తెలిసింది. గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాలు అప్పగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఘటనాస్థలాన్ని హోంమంత్రి అనిత, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, సురేష్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, రవాణా, పోలీసు శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు.

**ఎక్కువ మంది బేల్దారి కూలీలే**

నెల్లూరు జిల్లా ఉదయగిరి, మార్కాపురం జిల్లా నుంచి కూలీలు నిర్మాణ పనుల కోసం తెలంగాణలోని జగిత్యాల, కామారెడ్డి, ఆర్మూర్ ప్రాంతాలకు వెళ్లారు. వీరంతా శ్రీరామనవమి ఉత్సవాల కోసం బుధవారం సాయంత్రం స్వస్థలాలకు బయల్దేరారు. గురువారం ఉదయం 5.40కి బస్సు మార్కాపురం దాటి వెళ్తుండగా... రహదారి మూలమలుపు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంగా కుడివైపు వెళ్లాడు. ఎదురుగా వస్తున్న టిప్పర్ డ్రైవర్ గమనించి వెంటనే తన వాహనాన్ని పక్కకు తప్పించే ప్రయత్నం చేశాడు. ఈలోగా బస్సు టిప్పర్ సగభాగానికి వచ్చి బలంగా ఢీకొట్టడంతో డీజిల్ ట్యాంకు పగిలి వెంటనే మంటలు వ్యాపించి, రెండు వాహనాలకూ అంటుకున్నాయి. ప్రమాదతీవ్రతకు టిప్పర్ బోల్తాపడింది. దాని డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. దట్టంగా పొగ కమ్ముకొని ఉక్కిరిబిక్కిరి అవుతున్నా.. కొంతమంది బస్సు అద్దాలు పగలగొట్టుకొని దూకేశారు. ముందుభాగంలో ఉన్నవారే ఎక్కువమంది బయటపడ్డారు. మరికొందరు వెనుక ఉన్న అత్యవసర ద్వారం నుంచి బయటపడ్డారు. ప్రయాణికుల్లో ఒకరైన మేస్త్రీ బాలరాజు.. దగ్గర్లో ఉన్న మొద్దు కత్తితో అద్దాలు పగలగొట్టి ఏడుగురి ప్రాణాలు నిలిపాడు. ఒకరు తన భార్యను అద్దాల నుంచి బయటకు దించి, ఐదు నెలల పసికందుతో మృతిచెందారు. మరొక ప్రయాణికుడు సగభాగం బయటకు రాగా, మిగిలిన భాగం కాలిపోయి దహనమైన తీరు హృదయవిదారకంగా ఉంది. ఎక్కువమంది ఒకేసారి బయటకు వచ్చే క్రమంలో జరిగిన తొక్కిసలాటతో... డ్రైవర్ సీటు, అత్యవసరం ద్వారం వద్దే ఐదుగురు మంటలంటుకుని చనిపోయిన తీరు గుండెల్ని పిండేసింది. ఉదయం 6.10 గంటలకు పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.

**డ్రైవర్ పొంతన లేని సమాధానాలు**

ప్రమాదం జరిగిన వెంటనే ట్రావెల్స్ బస్సు డ్రైవర్ బస్సులోంచి దూకేసి పొదల్లో దాక్కున్నాడు. కాసేపటికి పోలీసులు అతన్ని అదుపులో తీసుకొని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ఎలా జరిగిందంటే స్టీరింగ్ పట్టేసిందని ఒకసారి చెప్పాడు. మరోసారి టిప్పర్ డ్రైవర్ రాంగ్‌రూట్‌లో వస్తున్నాడని, దాంతో తాను కుడివైపు పోనిచ్చానని, ఎదురుగా మరో కారు రావడంతో మళ్లీ ఎడమవైపు వచ్చి టిప్పర్‌ను ఢీకొట్టానని అన్నాడు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో యర్రగొండపాలెం టోల్‌గేట్ దాటిన తర్వాత కొంత సమయం బస్సు నిలిపారని... ఆ సమయంలో బస్సుకు మరమ్మతులు చేశారని, తర్వాత డ్రైవర్ మారాడని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సులో ఐదు కిలోల ఖాళీ సిలిండర్, ఆయిల్ డబ్బాలు వెనుకభాగంలో ఉన్నాయి. ఆయిల్ అంటుకుంటే మరింత ప్రమాదం జరిగేది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ప్రమాదంలో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని జిల్లా రవాణాధికారిణి సుశీల వెల్లడించారు. బస్సు ధ్రువపత్రాలు, గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా అనేది పరిశీలిస్తున్నామన్నారు. అసలే కొండ.. ఆపై మలుపులు, రోడ్డు పక్కన ముళ్లపొదలు వెరసి ఎదురుగా ఏ వాహనం వస్తోందో బాగా దగ్గరికి వస్తే తప్ప తెలియని పరిస్థితి ఉంది. కారణం ఏదైనా.. అమాయకుల ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి.

**బస్సు దుర్ఘటనలో మృతుల వివరాలివి**

**మార్కాపురం జిల్లా..**

అంబటి అనిల్ (27), లియో (5 నెలలు), పెదారికట్ల గ్రామం, కొనకనమిట్ల మండలం
ఉప్పు రమాదేవి (50), లింగారెడ్డిపల్లి, కనిగిరి మండలం
దేవండ్ల రామయ్య (55), బీసీ కాలనీ, కనిగిరి పట్టణం
బండారు పద్మ (28), కనిగిరి పట్టణం
తమ్మిశెట్టి పిచ్చమ్మ (80), తమ్మిశెట్టి రుక్మిణి (26), చల్లగిరిగిల, కనిగిరి మండలం
పొదిలి మహేంద్ర (30) చౌడవరం, వెలిగండ్ల మండలం
నార్సింగి చైత్ర (6), నార్సింగి ప్రభావతి (36), ఉన్నగురవాయపాలెం, పొదిలి మండలం

**నెల్లూరు జిల్లా**

ముత్తంగి వెంకటేశ్వర్లు (45), దాసరిపల్లి, ఉదయగిరి మండలం
ఆత్మకూరు చిన్న (45), బొమ్మరాజుపల్లి, కలిగిరి మండలం
కత్తి జయరాములు (60), మంగళకట్ట, బుచ్చిరెడ్డిపాలెం మండలం
గుల్లపల్లి వెంకటేశ్వర్లు (29), గొట్టిగుండ్ల గ్రామం, కొండాపూర్ మండలం

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

బస్సు ప్రమాద మృతులు, క్షతగాత్రుల సమాచారం నిమిత్తం ఒంగోలులోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబరు 1077 ఏర్పాటు చేశారు. మార్కాపురం ఆర్డీవో కార్యాలయంలో కంట్రోలు రూమ్ ఏర్పాటు చేసి, నలుగురు ఉద్యోగులకు విధులు కేటాయించారు. వారి ఫోన్ నంబర్లు వరుసగా విష్ణువర్ధన్ (63042 85613), కిషోర్‌కుమార్ (99857 33999), రాఘవేంద్ర (79895 37285), శశికుమార్ (97035 78434).

# అమరావతికి చట్టబద్ధతపై 28న తీర్మానం

-మొదటిపేజీ తరువాయి

తర్వాత బదిలీపై వెళ్లినప్పుడు రాజధాని రైతులు, మహిళలు పలికిన అపూర్వ వీడ్కోలును ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

**ఎవరూ కదిలించే అవకాశం లేకుండా కట్టుదిట్టం**

అమరావతికి చట్టబద్ధతపై ప్రవేశపెట్టే తీర్మానంలో పదజాలం ఎలా ఉండాలన్న అంశంపై చర్చించారు. తీర్మానంపై సమన్వయ బాధ్యతను మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్‌లకు అప్పగించారు. రాజధానిని అమరావతి నుంచి భవిష్యత్తులో ఎవరూ కదిలించేందుకు వీల్లేకుండా, న్యాయపరంగా ఎలాంటి అవాంతరాలు ఎదురవకుండా దుర్భేద్యమైన చట్ట రక్షణ కల్పించేందుకు ఇది సువర్ణావకాశమని సీఎం పేర్కొన్నారు.
జగన్ అమరావతిని సర్వనాశనం చేయాలనుకున్నారు
అమరావతిని సర్వనాశనం చేసేందుకు జగన్, ఆయన పార్టీ అనేక కుట్రలకు పాల్పడిందని కొందరు మంత్రులు చెప్పారు. మూడు రాజధానుల బిల్లును అప్పటి శాసనమండలి ఛైర్మన్ షరీఫ్ సెలక్ట్ కమిటీకి పంపిస్తే అడ్డుకున్నారనే అక్కసుతో అప్పటి మంత్రులు, వైకాపా సభ్యులు ఆయనపై దాడికి పాల్పడినంత పనిచేశారని సీఎం చెప్పారు.
అయినా షరీఫ్ గట్టిగా నిలబడటం చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. తర్వాత మండలి ఛైర్మన్ సంతకం లేకుండానే ఆ బిల్లును గవర్నర్‌కు పంపారని, దానిపై అప్పట్లో రైతులు కోర్టుకెళ్లారని మనోహర్ చెప్పారు.

**మంత్రి నారాయణపై సీఎం అసహనం**

రాజధానిలో వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాల వెనుక కుట్ర కోణం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. 'రాజధాని పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ వచ్చినప్పుడు అగ్నిప్రమాదం జరిగింది. ఇటీవల ఒక గుత్తేదారు సంస్థకు చెందిన మెటీరియల్ సైట్‌లోనూ మంటలు చెలరేగాయి. తాజాగా మేఘా కంపెనీకి చెందిన పైపులు తగలబడ్డాయి. 130 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత వద్ద మాత్రమే ఆ పైపులు తగలబడి, కరిగిపోతాయని చెబుతున్నారు. కాబట్టి అదేదో ప్రమాదవశాత్తు జరిగింది కాదు. వరుస ప్రమాదాలు జరుగుతుంటే మీరు పట్టించుకోకపోతే ఎలా? విచారణ చేయాల్సిన బాధ్యత లేదా?' అని పురపాలకశాఖ మంత్రి నారాయణపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఇకపై అలాంటి ఘటనలు జరగకుండా భద్రత కట్టుదిట్టం చేస్తున్నామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని నారాయణ తెలిపారు.

**నియోజకవర్గాల పునర్విభజన మంచిదే**

నియోజకవర్గాల పునర్విభజన రాజకీయ పార్టీలకు మంచిదేనని, 50 శాతం సీట్లు పెరగడం వల్ల ఎక్కువ మందికి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.
నియోజకవర్గాలు పెరగడం వల్ల పరిపాలన సౌలభ్యం ఉంటుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి తేవడం వల్ల చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందన్నారు.
ఏప్రిల్ 5న జగ్జీవన్‌రామ్ జయంతితో ప్రారంభించి ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిలోగా ప్రతి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీలకు సూర్యఘర్ పథకం కింద 2 వేల ఇళ్లకు ఉచితంగా సౌర విద్యుత్ సదుపాయం కల్పించాలని నిర్ణయించారు.

# అమరావతికి చట్టబద్ధతపై తీర్మానం

-మొదటిపేజీ తరువాయి

తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్లకు వెల్లడించారు. 'రాజధానిగా అమరావతిపై 2025లో ఇప్పటికే ఒకసారి తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. కానీ, భవిష్యత్తులో రాజధానిని మార్చాలనే ఆలోచనే ఎవరూ చేయకూడదని, రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతి విరాజిల్లాలనే ఉద్దేశంతో అసెంబ్లీలోనూ తీర్మానం చేయాలని నిర్ణయం తీసుకున్నాం. దానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది' అని వెల్లడించారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు..

**అమరావతి నిర్మాణ పనులపై విద్యుత్‌శాఖ ఛార్జీల తగ్గింపు**

అమరావతిలో రాజధాని పనులకు అడ్డుగా ఉన్న కరెంట్ స్తంభాలు, లైన్లను పక్కకు మార్చాల్సి ఉంది. దీనికిగాను విద్యుత్ శాఖ 15% ఛార్జీ అడగడంతో రాజధాని ప్రాజెక్ట్ ఖర్చు విపరీతంగా పెరుగుతోంది. ఖజానాపై ఆర్థిక భారం తగ్గించి పనులను త్వరగా పూర్తి చేయాలన్న ఉద్దేశంతో అమరావతి పనులకు ఈ అడ్మినిస్ట్రేటివ్ ఓవర్‌హెడ్ పర్యవేక్షణ ఛార్జీలను 15% నుండి 2.5%కి తగ్గించే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

పోలవరం నిర్వాసిత కుటుంబాలకు భూమి, కాలనీల రూపంలో పునరావాసం కల్పించేందుకు పోలవరం జిల్లాలోని గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో గుర్తించిన భూముల ప్రాథమిక ధరను ఎకరాకు రూ.4.20 లక్షలకు పెంచేందుకు కలెక్టర్‌కు అనుమతిచ్చే ప్రతిపాదనకు ఆమోదం. ప్రస్తుతం అక్కడ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఎకరా రూ.1.13 లక్షలు మాత్రమే ఉంది. వారికి మరింత మేలు చేకూర్చేందుకు ప్రాథమిక ధరను రూ.4.20 లక్షలుగా నిర్ణయించింది. 4,520 ఎకరాల భూ సేకరణకుగాను ఎకరాకు రూ.12.50 లక్షల (2013 భూసేకరణ చట్టం ప్రకారం) చొప్పున పరిహారం చెల్లించేందుకు మొత్తం రూ.565 కోట్లు వ్యయం కానుంది.

వడ్డెర సంఘాలకు క్వారీ లీజుల్లో 15% కేటాయింపు, సీనరేజీ ఫీజులో 50% రాయితీ ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం. 2022లో అప్పటి ప్రభుత్వం క్వారీలను వేలం పద్ధతిలో ఇవ్వడం మొదలుపెట్టాక వారికి తీవ్ర అన్యాయం జరిగింది. రాష్ట్రంలో 300కు పైగా వడ్డెర సంఘాలున్నా ఒక్క లీజు కూడా వాళ్లకు దక్కలేదు. వారి జీవనోపాధిని కాపాడేందుకు 2025లో మైనర్ మినరల్ పాలసీలో పాత పద్ధతిని తిరిగి తీసుకొచ్చింది. దీని ద్వారా 15 శాతం క్వారీలను (ఒక సొసైటీకి గరిష్ఠంగా 12 హెక్టార్లు) వడ్డెరలకు రిజర్వ్ చేస్తారు. ఈ లీజులను వేరే వారికి అమ్ముకోవడానికి మాత్రం వీల్లేదు.

**కోచింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

రాష్ట్రంలో ప్రైవేట్ కోచింగ్ సంస్థల నియంత్రణ, రిజిస్ట్రేషన్, పర్యవేక్షణ కోసం 'ది ఆంధ్రప్రదేశ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ (రెగ్యులేషన్ అండ్ కంట్రోల్) రూల్స్- 2026' ముసాయిదా నోటిఫికేషన్ జారీకి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇది అమల్లోకి వస్తే అన్ని కోచింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. సంస్థలు నాణ్యమైన బోధనతో పాటు కనీస మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి.

**ఎస్ఆర్ఎంలో 60మీటర్ల ఎత్తు భవనం**

అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ 60 మీటర్ల ఎత్తు వరకు నిర్మించేందుకు అనుమతిచ్చే ప్రతిపాదనకు ఆమోదం. నిర్మాణంలో రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ చట్టం, నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను తప్పనిసరిగా పాటించాలని నిర్ణయం తీసుకుంది.

**ఆస్తి పన్నుపై 50% వడ్డీ మాఫీ**

ఏపీ మున్సిపల్ చట్టంలోని అధికారాలను వినియోగించి పురపాలిక, మునిసిపల్ కార్పొరేషన్లలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలపై పేరుకుపోయిన వడ్డీలో 50 శాతం మాఫీ చేసేందుకు జారీ చేసిన ఉత్తర్వుకు ఆమోదం. రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో రూ.2,409 కోట్లు బకాయి పేరుకుపోయింది.

**పీఎన్‌జీకి దీపం రాయితీ**

ఇళ్లకు సురక్షిత, పర్యావరణహితమైన పైప్డ్ నాచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వాడుకునే వినియోగదారులకు రాయితీ వర్తించే ప్రతిపాదనకు ఆమోదం. ప్రస్తుతం దీపం-2 పథకం కింద ఎల్‌పీజీ కనెక్షన్ ఉన్న లబ్ధిదారులకు అందుతున్న విధంగానే పీఎన్‌జీ కనెక్షన్ కలిగిన వినియోగదారులకు సైతం రాయితీ వర్తిస్తుంది. దీనికయ్యే వ్యయాన్ని దీపం-2 లేదా ఎనర్జీ సబ్సిడీ పథకాల బడ్జెట్ నుంచి కేటాయించాలని నిర్ణయించింది.

**కొత్తగా 96 కోర్టుల ఏర్పాటు**

హైకోర్టు ప్రతిపాదించిన విధంగా కొత్తగా 96 కోర్టులు, వాటిల్లో 1730 పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. వీటిని జాబ్ క్యాలెండర్‌లో కలిపి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## నదిలో మునిగిన బస్సు.. బంగ్లాదేశ్‌లో 24 మంది మృతి

-మొదటిపేజీ తరువాయి

జరిగింది. బల్లకట్టు మీదుగా అవతలి ఒడ్డుకు వెళ్తున్నప్పుడు మరో చిన్న బల్లకట్టు వచ్చి ఢీకొంది. స్టీరింగుపై బస్సు డ్రైవరు నియంత్రణ కోల్పోవడంతో అది బల్లకట్టుపై నుంచి జారి, నదిలో పడిపోయింది.

## పవన్ కల్యాణ్‌ను కలిసిన యంగ్ బైకర్ తాప్సీ ఉపాధ్యాయ...

-మొదటిపేజీ తరువాయి

మిషన్ హెల్తీ భారత్" యాత్రలో భాగంగా ఆమె గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా తన యాత్ర వివరాలను తాప్సీ పవన్‌కు వివరించారు. ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు మార్చి 9న మీరట్‌లో ఈ సోలో బైక్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. బుల్లెట్‌పై ఒంటరిగా ప్రయాణిస్తూ ఇప్పటివరకు సుమారు 17,400 కిలోమీటర్లు పూర్తి చేశానని, 16 రాష్ట్రాల్లోని 500కు పైగా విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించానని చెప్పారు. మిగిలిన 12 రాష్ట్రాల్లో కూడా తన యాత్రను కొనసాగిస్తానని ఆమె పేర్కొన్నారు.తాప్సీ ఉపాధ్యాయ సాహసోపేతమైన సంకల్పాన్ని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి, యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. దేశ ప్రజల ఆరోగ్యం కోసం ఆమె చేస్తున్న కృషి ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన అభిలషించారు. 23 ఏళ్ల తాప్సీ చేపట్టిన ఈ మిషన్ గొప్పదని కొనియాడారు.

## ఇరాన్ నుంచి మాకు గిఫ్ట్ వచ్చింది... 10 చమురు ట్యాంకర్లను పంపించింది

ఇరాన్ నుంచి తమకు పెద్ద గిఫ్ట్ వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ 10 చమురు ట్యాంకర్లను పంపించిందని ఆయన తెలిపారు. హర్మూజ్ జలసంధి గుండా వీటిని పంపించిందని ఆయన పేర్కొన్నారు. ఈ జలసంధి వద్ద ఇరాన్ ఎలాంటి టోల్ ఛార్జీని వసూలు చేయలేదని అన్నారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. హర్మూజ్ మీదుగా వస్తున్న ఆయా ట్యాంకర్లపై పాకిస్థాన్ జెండాలు ఉన్నట్లు వెల్లడించారు.పశ్చిమాసియాను స్వాధీనం చేసుకోవాలని ఇరాన్ భావించిందని, కానీ తాము అడుగుపెట్టేసరికి వారికి కష్టంగా మారిందని ట్రంప్ అన్నారు. ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఒమన్ దేశాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. పశ్చిమాసియాను స్వాధీనం చేసుకోవడానికి ఇరాన్ వద్ద పక్కా ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. అందుకే ఆ దేశాల పైకి క్షిపణులను ప్రయోగించిందని అభిప్రాయపడ్డారు.గల్ఫ్ దేశాల పైకి ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో కొన్ని యుద్ధం ప్రారంభానికి చాలాకాలం ముందే గురిపెట్టి ఉన్నాయని ట్రంప్ అన్నారు. ఆయుధాలను లోడ్ చేసి దాడులకు సిద్ధంగా ఉంచిందని ఆరోపించారు. అయితే అమెరికా దాడి నేపథ్యంలో అంతా నిర్వీర్యమైందని అన్నారు.

**ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయి**

ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని ట్రంప్ ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ అన్నారు. యుద్ధాన్ని నిలిపివేసేందుకు రూపొందించిన పదిహేను పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ముందు ఉంచినట్లు అమెరికా వెల్లడించింది. ఒప్పందం కుదురుతుందని, ఉద్రిక్తతలు తగ్గుతాయని స్టీవ్ విట్కాఫ్ అభిప్రాయపడ్డారు.

## 7 నగరాల్లో 10 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు

రాష్ట్రవ్యాప్తంగా ఏడు నగర ప్రాంతాల్లో 10 లక్షల పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌పీజీ నుంచి పీఎన్‌జీకి మారిన దీపం-2 లబ్ధిదారులకు కూడా రాయితీ వర్తింపజేయడంతోపాటు రెండు నెలలకు ఒకసారి (పైప్డ్ గ్యాస్ బిల్లింగ్) చొప్పున ఏడాదికి రూ.2,400 వారి ఖాతాల్లో జమ చేయనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పీఎన్‌జీపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్ సౌరభ్ గౌర్ విలేకర్లకు చెప్పారు. వైకాపా హయాంలో పీఎన్‌జీపై జీఎస్టీని 25 శాతానికి పెంచి, వ్యవస్థను నిర్వీర్యం చేశారని మనోహర్ విమర్శించారు. మంత్రి చెప్పిన వివరాలివీ..
'విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, కర్నూలు నగరాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ విధానాన్ని మరింత విస్తరిస్తాం. నగరాల్లో మెయిన్ ట్రంక్‌లైన్లు ఉన్నాయి. అక్కడ నుంచి సబ్‌లైన్ల ఏర్పాటు కష్టం కాదు. అయితే వీటికి అనుమతుల విషయంలో ఇబ్బందులున్నాయి. పురపాలక, పరిశ్రమలు, పంచాయతీరాజ్, పౌరసరఫరాల శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం. హోటళ్లు, రెస్టారెంట్లు, అపార్ట్‌మెంట్లు, ఉమ్మడి గృహసముదాయాలకు పీఎన్‌జీ కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రాధాన్యమిస్తాం. పీఎన్‌జీ పైప్‌లైన్‌కు దరఖాస్తు చేస్తే 24 గంటల్లో నగరపాలక సంస్థలు అనుమతివ్వాలి. లేదంటే అనుమతి ఇచ్చినట్లుగానే భావించాలి. నెల వ్యవధిలోనే లక్ష పీఎన్‌జీ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించాం.

**దేవస్థానాలు, అన్న క్యాంటీన్లకు కూడా**

తితిదే, విజయవాడ దుర్గమ్మ, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహాచలం దేవస్థానాలతోపాటు అన్న క్యాంటీన్లకూ పీఎన్‌జీ సౌకర్యం కల్పిస్తాం. కేంద్రం ఒక్కో పీఎన్‌జీ కనెక్షన్‌కు ఇచ్చే రూ.500 రాయితీ కూడా లబ్ధిదారులకు అందుతుంది. సిటీ గ్యాస్ పంపిణీ సంస్థలతో సమావేశాలు నిర్వహించి, ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పైప్‌లైన్ తవ్వకాలకు మానవవనరుల్ని సమీకరిస్తున్నాం.

**రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదు**

పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతంటూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా కొరత లేదు. కొరత వస్తుందేమోననేఆందోళనతో.. అందరూ ఒకేసారి బుక్ చేయడం వల్లే సమస్యలొస్తున్నాయి.
గృహావసర కనెక్షన్లకు రోజుకు 4వేల టన్నుల ఎల్‌పీజీ డిమాండ్ ఉంది. గత వారం రోజులుగా సగటున 3,900 టన్నులు సరఫరా చేస్తున్నాం. రోజూ 2.72 లక్షల కనెక్షన్లకు సిలిండర్లు ఇస్తున్నాం. బుధవారం 3.01 లక్షల మందికి ఇచ్చాం.
మొత్తం గ్యాస్ కేటాయింపులో పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, వసతిగృహాలకు 40% సరఫరా చేస్తున్నాం.

## నేపాల్ నూతన ప్రధానిగా బాలేంద్ర షా

-మొదటిపేజీ తరువాయి

పరిణామాలు పూర్తిగా మారిపోయాయి. గత 18 ఏళ్లలో 14 ప్రభుత్వాలు మారిన ఈ హిమాలయ రాజ్యంలో.. యువనేత నేత బాలేంద్ర షా సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది.

**ఎవరీ బాలేంద్ర షా..?**

కాఠ్‌మాండూకు చెందిన బాలేంద్ర షాను బాలెన్ షాగా పిలుస్తుంటారు. వీరి కుటుంబం మాధేశ్ ప్రాంతం నుంచి రాజధానికి వచ్చి స్థిరపడింది. ఎప్పుడూ నలుపు కళ్లజోడులో కనిపించే బాలెన్ ఓ ర్యాపర్ కూడా. దేశంలో అస్థిర రాజకీయాలు, అవినీతినీ విమర్శిస్తూ పాడిన కవితలతో అనతికాలంలోనే యూత్ ఐకాన్‌గా మారారు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం కాఠ్‌మాండూ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆర్ఎస్‌పీ తరఫున పోటీ చేసి ప్రధాని పీఠం దక్కించుకున్నారు.

# జిజిహెచ్ అభివృద్ధి పెండింగ్ అంశాల పై ప్రత్యేక సమావేశంలో పెమ్మసాని





**గుంటూరు, పెన్ సత్తా, మార్చి 26:** లోని స్థానిక కలెక్టరేట్ లో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన హెచ్డిఎస్ కమిటీ సభ్యులతో కలెక్టర్ తమీం అన్సారియా, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో
పెమ్మసాని మాట్లాడుతూ జిజిహెచ్ అభివృద్ధి కి సంబంధించిన పెండింగ్ అంశాల పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించడం జరిగిందన్నారు.
తులసి రామ్ చంద్ర ప్రభు ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న ఎంసిహెచ్ బ్లాక్ 50% ఇప్పటికీ పూర్తయిందన్నారు. పేట్ స్కాన్ రూ. 18 కోట్లతో ప్రభుత్వం మంజూరు చేసింది. దానిని కూడా మరో 2-3 వారాల్లో అందుబాటు లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. పలు పత్రికల్లో వచ్చిన జిజిహెచ్ లో ఎదురవుతున్న పలు సమస్యల పై అధికారులు, సూపరింటెంట్ తో మాట్లాడి, సమస్యలకు సంబంధించిన పరిష్కారాల పై పలు సూచనలు చేశామన్నారు. అవసరానికి మించి బెడ్లు జిజిహెచ్ లో అవసరం అవుతున్నాయి. ఓవర్ లోడ్ కారణంగా బెడ్ల కొరత సమస్య తలెత్తుతుంది. సమస్యలను ఎప్పటి కప్పుడు అధ్యయనం చేస్తూ, పరిష్కరించే హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు.
ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గతంలో ఎప్పుడూ లేనివిధంగా సీఎస్ఆర్ నిధులతో అనేక అభివృద్ధి పనులను చేసి చూపిస్తున్నాం అన్నారు. షార్టెజ్ ఉన్న మెడిసిన్స్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, అత్యాధునిక మైన సౌకర్యాలతో నాట్కో ద్వారా క్యాన్సర్ పేషంట్స్ కి వైద్య సేవలను అందిస్తున్నాం. కార్పొరేట్ వైద్య సేవలకు ధీటుగా జిజిహెచ్ సేవలను ప్రజలకు అందిస్తాము అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రాంప్రసాద్(బుజ్జి), జిజిహెచ్ వైద్యులు, అధికారులు, హెచ్డిఎస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అరటి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి డిమాండ్.
- కడపలో కలెక్టర్ ముట్టడి కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కేఎస్ షానవాజ్.





**కడప, పెన్ సత్తా, మార్చి 26:**గత కొద్ది రోజుల క్రితం సింహాద్రిపురం మండలం కసునూరు గ్రామంలో అకాల వర్షాల కారణానంగా అరటిపంటకు నష్టం కలిగింది ఈ సందర్భంగా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కడప కలెక్టర్ ని కలిసి అరటి రైతులను ఆదుకోవాలని, అరటి పంటకు గిట్టుబాటు ధరను కూటం ప్రభుత్వం ఇవ్వాలని, కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని వైఎస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు.

# పేదల ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలి.



జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చ్ 26:** ప్రజల ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ కోరారు. గురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (బ్యాంకర్ల సమావేశం) జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా గత సమావేశంలో జరిగిన అంశాలను, వాటి ఫలితాలను ఎల్డిఎమ్ సత్యనారాయణ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల ఆర్థిక అభ్యున్నతికి కోసం చేస్తున్న పథకాలకు అనుగుణంగా ఔత్సాహికులకు రుణ సదుపాయం కల్పించాలని అన్నారు. విద్యా రుణాలు, ఎం ఎస్ ఎం ఈ లకు, పి ఎం సూర్య ఘర్ పథకాలకు, వ్యవసాయ రుణాలు, ఇన్వెస్ట్మెంట్ క్రెడిట్ కింద విరివిగా రుణాలు అందించాలని బ్యాంకర్లకు సూచించారు. రుణాలు అందించడంలో అన్ని బ్యాంకులు లక్ష్యాలు సాధించాలన్నారు. సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయాలని అన్నారు. అధికారులు, ఎస్ హెచ్ జి మహిళలు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి రుణాల మంజూరులో సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్య రుణాల పట్ల విద్యార్థులలో అవగాహన కలిగించి ప్రోత్సహించాలన్నారు. పి ఎం సూర్య ఘర్ రుణాలను పెంచాలని, తద్వారా సోలార్ విద్యుత్ వినియోగం పట్ల ప్రజలలో అవగాహన కలిగించాలన్నారు. వ్యవసాయ రుణాల మంజూరు, రెన్యువల్ సమయాలలో రీ సర్వే వలన ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే రెవెన్యూ అధికారులతో చర్చించి పరిష్కరించు కోవాలన్నారు.
జిల్లాలో నాబార్డ్ యొక్క పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పిఎల్పి) వార్షిక ప్రణాళిక పుస్తకాన్ని(2026-27) ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, పలు బ్యాంకుల మేనేజర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# గురునాథ రావు విగ్రహం ధ్వంసం పై నిరసన కార్యక్రమంలో పయిల



**తగరంపూడి, పెన్ సత్తా, మార్చి 26:**మాజీ మంత్రి గుడివాడ గురునాథ రావు విగ్రహం ధ్వంసం చేసిన కారణంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు. గురువారం
తగరంపూడి గ్రామంలో మాజీ మంత్రి, మాజీ ఎంపీ గుడివాడ గురునాథ రావు విగ్రహం ధ్వంసం చేసిన వారిని ప్రభుత్వం, పోలీసులు కటినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఛలో తగరంపూడి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గం పరిశీలకులు పయిల శ్రీనివాసరావు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ లు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, కో ఆర్డినేటర్ లు కరణం ధర్మశ్రీ, మలసాల భరత్, జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డెడ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభిమానించే నాయకులు మాజీ మంత్రి, మాజీ ఎంపీ గా సేవలందించిన గుడివాడ గురునాథ రావు అన్నారు. లాంటి మహనీయుని విగ్రహం ధ్వంసం చేసిన వారిని ప్రభుత్వం, పోలీసులు కటినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, అతి త్వరలోనే అదే ప్రదేశంలో గురునాథ రావు విగ్రహం ను ఏర్పాటు చేసి తీరుతామని ప్రతిజ్ఞ చేశారు.

# నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్






**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 26:**ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో గురువారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, లారస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సి ప్రతిమ అమ్మవారికి ప్రత్యేక పూజల నిర్వహించారు ముందుగా ఆలయ మర్యాదలతో సన్నాయి మేళం, పూర్ణకుంభంతో వీరికి స్వాగతం పలికారు. అష్టమ తిది గురువారం సందర్భంగా ఆలయ మండపంలో అమ్మవారికి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వీరిని మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ
కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు
సూరే సతీష్ కుమార్, దాడి రవి కుమార్,
పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు,
కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు,
కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.




# శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్.

**సత్యసాయి, పెన్ సత్తా, మార్చి 26:**శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదర్శ పురుషుడు శ్రీరామచంద్రుని ఆశీస్సులు జిల్లా ప్రజల పై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభాగ్యాలు విరాజిల్లాలని ఆకాంక్షించారు. ధర్మం, సత్యం, క్రమశిక్షణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చు కోవాలని ఆయన కోరారు.



# కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.25 కోట్ల రుణాలను పంపిణీ.

కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ, కేడీసీసీ బ్యాంక్ చైర్మెన్ నెట్టెం రఘురాం.





**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 26:** ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీ) ఆధ్వర్యంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు, హౌసింగ్ లోన్లకు సంబంధించి సుమారు 25 కోట్ల రూపాయల రుణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం ముఖ్య అతిథులుగా హాజరై బ్యాంక్ కు చెందిన ఆరు బ్రాంచ్ లైన గన్నవరం, హనుమాన్ జంక్షన్, తేలప్రోలు, ఉంగుటూరు, రామవరప్పాడు, సత్యనారాయణపురం బ్రాంచ్ ల ద్వారా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి అనుగుణంగా సహకార వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, ఈ ఏడాది కేడీసీసీ బ్యాంకు ద్వారా సుమారు 8,700 కోట్ల రూపాయల రుణాలను అందించామని తెలిపారు. వ్యవసాయ రుణ పరపతి పెంచడంలో తమ బ్యాంకు రాష్ట్రం లోనే ముందుందని, అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను రైతులకు చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కేడిసిసి చైర్మన్ రఘురాం చేతుల మీదుగా నియోజకవర్గానికి 25 కోట్ల రుణాలు అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. గత వైసీపీ పాలనలో కేడీసీసీ బ్యాంకులో విపరీత మైన విధ్వంసం, అవినీతి జరిగిందని ఆయన మండి పడ్డారు. చల్లపల్లి వంటి పల్లెటూరులో లక్ష రూపాయల సెంట్ విలువ ఉన్న భూమిని ఐదు లక్షలకు కొని స్థానిక నాయకులు, అప్పటి చైర్మన్ కలిసి దోచుకున్నారని ఆరోపించారు. మహానుభావులు పాలించిన ఈ బ్యాంకులో జగన్ హయాంలో జరిగినంత అవినీతి ఎప్పుడూ జరగలేదని, దీని పై హౌస్ కమిటీ వేశామని, తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. రాబోయే కాలంలో నియోజకవర్గానికి సీడీఎఫ్ కూడా కేటాయించాలని కోరారు. అమరావతిని మారుద్దామనుకున్న జగన్ తన హయాంలో అక్కడ ఒక్క ఇటుక కూడా కదపలేకపోయారని ఎద్దేవా చేశారు. ఎల్లుండి శాసనసభలో అమరావతి పై ప్రత్యేక తీర్మానం చేసి కేంద్ర క్యాబినెట్ ఆమోదం పొందేలా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జగన్ పాదయాత్ర చేస్తానని చెబుతున్నారని, ఆ యాత్రను అమరావతి నుంచే ప్రారంభించాలని, అప్పుడు అక్కడ జరుగుతున్న 59 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చూస్తే ఆయనకే జ్ఞానోదయం అవుతుందని సవాల్ విసిరారు. జగన్ కేవలం మీడియా అట్రాక్షన్ కోసం సినిమాలు చూపిస్తానని మాట్లాడుతున్నారని, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు వల్లే వైసీపీకి ప్రతిపక్ష హోదా పోయిందని గుర్తు చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రజలను అవమానిస్తున్న జగన్, కనీసం పార్లమెంటరీ సాంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు. వైసీపీ ఎమ్మెల్యేలు కూడా గెలిచి అసెంబ్లీకి వెళ్లకుండానే రిటైర్ అయిపోతామని బాధపడుతున్నారని, కనీసం అమరావతి బిల్లు చర్చకైనా జగన్ సభకు రావాలని యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, ఎన్.ఎస్.పి వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్, ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, విజయవాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షులు గొడ్డళ్ల చిన్న రామారావు, తెలుగురైతు నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలు కంభంపాటి లక్ష్మీ నరసమ్మ, పిఏసిఎస్ చైర్ పర్సన్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు,
రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన హెచ్ శ్రీనివాస్ రెడ్డి



**పెన్ సత్తా, మార్చి 26:** :చేగుంట మండల్ చందాయిపేట గ్రామం లో ఎన్ ఆర్ జీఎస్ నిధుల ద్వారా చేపడుతున్న 10లక్షలతో సీసీ రోడు పనులు గ్రామ సర్పంచ్ మహేశ్వరి సాయిబాబా వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అనంతరం గ్రామ సమస్యలను వివరించారు,జిల్లా ఇంచార్జీ మంత్రి గారితో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు

ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ మోజమిల్, స్టాలిన్ నర్సింలు, కాశబోయిన శ్రీనివాస్, దొంతి రెడ్డి బాల్ రెడ్డి,వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్, కసంపల్లి సర్పంచ్ భిక్య నాయక్, ఉపసర్పంచ్ పబ్బ నగేష్, సాయిబాబా, బస రాజు,చిన్న శివునూరు ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు సంద్రుగు శ్రీకాంత్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, మాజీ సర్పంచ్ రాంపూర్ కాశబోయిన భాస్కర్,మాజీ సర్పంచ్ జగన్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు,గ్రామ వార్డు సభ్యులు, కార్యకర్తలు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు

# బి. ఆర్. స్టేడియం పునరుద్ధరణ కోసం శంకుస్థాపన చేసిన పెమ్మసాని





**గుంటూరు, పెన్ సత్తా, మార్చి 26:** లోని స్థానిక వన్ టౌన్ లో గల బి. ఆర్. స్టేడియం పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి గాను ఖేలో ఇండియా పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 14 కోట్లను గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ మంజూరు చేయించారు. ఇందుకు గానూ స్థానిక ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి తో కలిసి గురువారం గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ
చరిత్రకు పునాది వేసే అవకాశం క్రీడలకే సాధ్యం అన్నారు. కాసు బ్రహ్మానంద రెడ్డి తరువాత, అన్న నందమూరి తారక రామారావు ఈ బి.ఆర్. స్టేడియం అభివృద్ధి కోసం పునాదులు వేశారన్నారు. అయితే గడిచిన 20 ఏళ్లుగా నిధుల కొరత, అభివృద్ధి లేమి కారణంగా స్టేడియం శిథిలావస్థకు చేరుతోందన్నారు. భారత దేశవ్యాప్తంగా క్రీడల కోసం కొన్ని వందల కోట్ల నిధులు మాత్రమే కేటాయించే అవకాశం ఉన్నందున, మన బి.ఆర్. స్టేడియంకు ముందుగా రూ. 170 కోట్లు మన వైపు నుంచి ప్రతిపాదించినా సరే, అవకాశం లేని కారణంగా రూ. 14 కోట్ల నిధులు రాబట్టగలిగామన్నారు. అనుకున్న విధంగా స్టేడియం అభివృద్ధి వివరాలను అధికారులు డిపిఆర్ ఏర్పాటులు పూర్తి చేయడం వల్ల త్వరగా నిధుల సేకరణకు వీలైందన్నారు. ఈ కార్యక్రమం గురించి మాట్లాడుకోవాలంటే ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ధన్యవాదాలు తెలియజేయాలి. నన్ను అమెరికా నుంచి తీసుకువచ్చి, నాకు ఈ అవకాశం అందించిన కారణంగానే నేను ఈ అభివృద్ధి చేయగలుగుతున్నాను.
క్రీడాభివృద్ధికి, క్రీడా సంబంధిత నిర్మాణాలు తదితర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తూ ఉంటారు. వారి కృషికి అనుగుణంగానే మేము కూడా పనిచేస్తున్నాం. మెడిటేషన్, స్క్వాష్ స్పోర్ట్స్, క్యారమ్స్, చెస్ తదితర క్రీడలకు అనుగుణంగా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేయబోతున్నాం. అదే విధంగా 500 మందికి పైగా ఆడియన్స్ కూర్చునే విధంగా ఒక అడ్మిన్ ఆఫీస్, గ్యాలరీ ఇలా అనేక ఏర్పాట్లు చేయబోతున్నాము.
దీనికోసం క్రికెట్ ప్రాంగణాన్ని డెవలప్ చెయ్యాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తో మాట్లాడాను. సానా సతీష్ అదే విధంగా కేశినేని చిన్ని కూడా వచ్చి చూశారు. క్రికెట్ స్టేడియం వరకు డెవలప్ చేస్తామని మాట ఇచ్చారన్నారు. త్వరలో ఇంకో కార్యక్రమం పెట్టి, క్రికెట్ స్టేడియం డెవలప్ చేసి ఈ ప్రాంతంలో జిల్లా స్థాయి రంజీ స్థాయి మ్యాచ్ లు ఆడే విధంగా క్రికెట్ స్టేడియంను కూడా ఇంకొక ఏడాది లేదా ఏడాదిన్నరలో అభివృద్ధి చేస్తాం. ప్రతిపక్ష నాయకుడు జగన్ మోహన్ రెడ్డి గురించి మాట్లాడుతూ.. జగన్ చంద్రబాబు మైండ్ సెట్ బాలేదని మాట్లాడారు. జగన్ మోహన రెడ్డి కి ఒకటే చెబుతున్నా.. మీకు రాష్ట్రం గురించి ఏదైనా మాట్లాడాలని ఉంటే, రాజకీయాలు మాట్లాడండి, సబ్జెక్టు గురించి మాట్లాడండి అంతే కానీ, వ్యక్తిగతంగా ఏది పడితే అది మాట్లాడితే, ఊరుకోం అని హెచ్చరించారు.
మీరు మాట్లాడే ఆ చంద్రబాబు మొహమే తెలుగు జాతిని ఈరోజు ప్రపంచంలో తలెత్తుకునే విధంగా చేసింది జగన్ రెడ్డి అని ఏద్దేవా చేశారు. మైండ్ సెట్ గురించి మీరు మాట్లాడుతారు, ఆయన్ను ఒక్కటే అడుగుతున్నా....ప్రజా వేదికను కూల్చడం మైండ్ సెట్ ఆ అని ప్రశ్నించారు. ప్రజల పొలాల పాస్ పుస్తకాల పై జగన్ తన బొమ్మలు వేసుకోవడం మైండ్ సెట్ ఆ అన్నారు.
మాస్క్ అడిగిన పాపానికి ఒక డాక్టర్ని చంపేయడం మైండ్ సెట్ ఆ!.
రాజకీయంగా మాట్లాడండి గానీ, మా నాయకుల్ని కించపరిస్తే, మేము కూడా నేను బాడీ షేమింగ్ చేయాలంటే ఒకే ఒక్క మాటతో మిమ్మల్ని చంపేయగలం కానీ, మాకు సంస్కారం అనేది ఉంది కాబట్టి మీలా ఏది పడితే అది మాట్లాడలేము అని తెలియజేసారు.
ఈ కార్యక్రమానికి విచ్చేసిన మీ అందరికీ కూడా మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, ఈ కార్యక్రమం అద్భుతంగా జరగాలని కోరుకుంటూ ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కూడా ధన్యవాదాలు అని పెమ్మసాని అన్నారు. అనంతరం
శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధి ధ్యేయంగా చంద్రశేఖర్ పనిచేశారు. నాకు ఎన్నికలకు ముందు పెమ్మసాని విద్యావంతులుగా బాగా తెలుసన్నారు.
రాజకీయాల్లోకి వస్తే మిస్సైల్ లాగా పనిచేయగలరని ఇప్పుడు నిరూపించి చూపిస్తున్నారన్నారు. ఎలక్షన్ టైం లో పెమ్మసాని ని ఇబ్బంది పెట్టాలని అరాచక వైసిపి ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసిందన్నారు. ఆ ప్రయత్నాలన్నింటినీ తిప్పి కొట్టి, భారీ మెజారిటీతో గెలవడమే గాక గుంటూరు అభివృద్ధిలో తాను తొలి అడుగు వేస్తే ఎలా ఉంటుందో ఆయన నిరూపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే నసీర్ కూడా బి.ఆర్. స్టేడియం అభివృద్ధి గురించి ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ బి.ఆర్. స్టేడియం అభివృద్ధి కోసం పలుమార్లు అసెంబ్లీ సమావేశాల్లో కూడా చర్చించడం జరిగింది. సమస్యను గుర్తించి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కే లో ఇండియా పథకం ద్వారా రూ. 14 కోట్లను మంజూరు చేయించడం ఆనందించదగ్గ అంశం. బి.ఆర్. స్టేడియం అభివృద్ధి కోసం అడిగిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ స్పందించి రూ. 2.5 కోట్లను అందించడం వల్ల స్టేడియం ఆక్రమణకు గురికాకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఎంతో మంది క్రీడాకారులను తయారు చేసిన బి.ఆర్. స్టేడియంను గత నాయకులు నిర్లక్ష్యం చేయడం వల్ల నేడు శిథిలావస్థకు చేరడం ఎంతో బాధాకరం.
మేము అధికారం లోకి వచ్చేనాటికి డిఆర్ స్టేడియంలో కుక్కల స్వైర విహారం బాధ కలిగించిందన్నారు. అలాంటి స్టేడియం అభివృద్ధి నా కలగా నిరంతరం పనిచేస్తున్నాను అన్నారు. ఎమ్మెల్యే
గల్లా మాధవి మాట్లాడుతూ ఈ స్టేడియం అభివృద్ధి గుంటూరు ప్రజల ఎన్నో ఏళ్ల కల అని, అభివృద్ధి పనుల కోసం శంకుస్థాపన జరుపుకోవడంతో ఆ కల సాకారం అయిందన్నారు. అలాంటి మన స్టేడియం అభివృద్ధికి శంకుస్థాపన చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.
ఈ స్టేడియం ఎందరో క్రీడాకారులకు జీవితాన్ని అందించిందన్నారు. ఇక్కడ జాతీయస్థాయిలో క్రీడలు, రంజీ మ్యాచ్ లు కూడా జరిగాయి. ఇవాళ ఖేలో ఇండియా ద్వారా రూ. 14 కోట్ల నిధులను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని తీసుకొచ్చి అభివృద్ధికి పునాది వేయడం చాలా గొప్ప విషయం. ఈ స్టేడియం అభివృద్ధి మాత్రమే కాదు, క్రీడాకారుల ఉన్నతికి కూడా పెమ్మసాని తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుంది అనడంలో అతిశయోక్తి లేదన్నారు. వెంగలాయ పాలెం చెరువు కావచ్చు, బి. ఆర్. స్టేడియం అభివృద్ధి కావచ్చు, శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం కావచ్చు, సమస్య ఏదైనా సరే స్థానిక ఎమ్మెల్యేలు సంప్రదించి తమ సమస్య ఇదీ అని చెప్పిన వెంటనే స్పందించే నాయకుడు పెమ్మసాని అని, ఆయన మనకు ఎంపీ గా ఉండటం మన గుంటూరు అదృష్టం అని చెప్పాలన్నారు. పెమ్మసాని ఈ స్టేడియం విషయంలో తీసుకున్న తొలి అడుగును మన అందరం స్ఫూర్తిగా తీసుకొని నిర్మాణంతో ఆగకుండా స్టేడియం అభివృద్ధికి, క్రీడాకారుల ఉన్నతకి కృషి చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.



ఆలపాటి రాజా మాట్లాడుతూ
ఎన్నికలకు ముందు నుంచి ప్రజలకు ఏం కావాలి, ప్రజా సంక్షేమానికి ఏం చేయాలి అనేది పెమ్మసాని కి ఒక ప్రత్యేక స్పష్టత ఉందన్నారు. మంత్రిగా పదవి తీసుకున్న తొలి రోజు నుంచి మంత్రిగా తాము ఏమి చేయాలి అనే తమ ప్రయత్నాలను మొదలు పెట్టి, నిధులను ఎక్కడెక్కడ నుంచి తీసుకువచ్చి ప్రజోపయోగ సౌకర్యాలు ఎలా ఏర్పాటు చేయాలి అని ఆలోచించి, ప్రయత్నించిన వ్యక్తుల్లో కోడెల శివప్రసాద్ తొలి నాయకుడు అయితే, పెమ్మసాని చంద్రశేఖర్ మలి నాయకుడు గా నిలుస్తారు. గుంటూరు నగర శివారుల్లో ఇప్పటి దాకా రోడ్లు నిర్మాణం జరగలేదు, మేయర్ గా కోవెలమూడి నాని వచ్చిన తర్వాతే ఆ రోజులు నిర్మాణం జరిగాయి. అలాంటి ఈ కూటమి ప్రభుత్వ నిర్ణయాలకు ప్రయత్నాలకు మనందరం సహకారం అందిస్తే కూటమీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా నిలిచిపోతుంది అనడంలో సందేహమే లేదని అన్నారు. ఈ శంకస్థాపన కార్యక్రమంలో ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె. ఈశ్వర్, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, కలెక్టర్ తమీం అన్సారియా, సాప్ ఎండీ ఎస్. భరణి, డీ.సీ.ఎం.ఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనా దేవి, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), శాప్ డైరెక్టర్ ఎస్. సంతోష్ కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పోతురాజు సమత, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు





**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 26:**
శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు మండలంలో పలు రామాలయాలు ముస్తాబయ్యాయి. ప్రతీ ఏటా లోక కళ్యాణార్థం నక్కపల్లి,ఉపమాక,కాగిత, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండ పురం,గొడిచర్ల, దేవవరం, డొంకాడ తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఉన్న రామాలయాల వద్ద పెద్ద ఎత్తున సీతారాముల కళ్యాణ పందిరిలు వేసి మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలను పురస్కరించుకొని ఉపమాక మెరక వీధి రామాలయం వద్ద ఈనెల 20 వ తేదీ నుండి సప్తహం భజన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించారు. భజన సమాజంలో పాల్గొన్న భజన బృందాలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సీతారాముల కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులను గ్రామాల్లో ఊరేగించిన అనంతరం ఆలయాల్లో సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## సిసి రోడ్డు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కంచం ద్రౌపది.





**చింతకాని పెన్ సత్తా, మార్చి 26:** మత్కేపల్లి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పది లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మత్కేపల్లి గ్రామ సర్పంచ్ కంచం ద్రౌపది .

ఈ సిసి రోడ్డు నిర్మాణము కొరకు నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు గారు మరియు సహకరించిన మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు కి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచం కోటేశ్వరరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బందిల నాగార్జున, నర్సింశెట్టి శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బోల్కొండ రామారావు. ఉప సర్పంచ్ పగడాల పుల్లమ్మ, వార్డ్ సభ్యులు వలమల వెంకట్రామయ్య, వలమల నాగేశ్వరరావు, జిల్లపల్లి పెద్ద పుల్లయ్య, కొల్లి నాగేంద్రమ్మ, పగడాల రాంబాయి, సొంపంగుల విజయ్, సొసైటీ మాజీ డైరెక్టర్ వలమల రాముడు, సంకెళ్ళ పాపారావు, తిరుపతి రామ్మూర్తి, గోద వెంకన్న, తిరుపతి సంజీవరావు, బండి అప్పారావు, బండి నారాయణ, వలమల నరేష్,ఆడెపు రామ్మూర్తి, జిల్లపల్లి గోవిందరావు, వెంకటవీరయ్య, జిల్లరావు, సైదులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి...

- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు
- పంట కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి,
- షరతులు లేకుండా రైతుల వద్ద పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలి,




**చింతకాని పెన్ సత్తా, మార్చి 26:** చింతకాని మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు,రైతులు పండించిన ధాన్యశీ, మొక్కజొన్న పంటను మార్క్ పెడ్ ద్వారా కొనుగోలు చేయాలని వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, మధిర నియోజవర్గ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన చింతకాని తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి పంట కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక తాసిల్దార్ బాబ్జి ప్రసాద్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న మాట్లాడుతూ ప్రభుత్వం పంట కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలని ప్రశ్నించారు.ఎటువంటి షరతులు లేకుండా రైతులు పండించిన పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న ఎకరానికి 27 క్వింటాలు మాత్రమే కొంటామనే నిబంధనను ఉపసంహరించుకోవాలని మొక్కజొన్న వరి ధాన్యాన్ని రైతుల వద్ద పంట మొత్తం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలకు గోనే సంచులు,పట్టాలు ట్రాన్స్ ఫోర్టు సమస్యలు రాకుండా కృషి చేయాలని అన్నారు.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని తిరిగి పునరావృతం కాకుండా చూడాలని నెలల తరబడి రాత్రి పగలు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడి గాపులు కాచే పరిస్థితి రాకుండా చూడాలని అన్నారు.కాటాలను వెంటనే వేసి లారీల సమస్య తలెత్తకుండా కుంటి షాక్ లు చూపెట్టకుండా ముందుగానే లారీలను ఏర్పాటు చేసి లారీల ద్వారా ట్రాన్స్ ఫోర్ట్ చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అమౌంట్ తో సహా వారం రోజులలో రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వత్సవాయి జానకి రాములు, మద్దిని బసవయ్య, రౌతు అప్పారావు, మడుపల్లి కిరణ్ , గడ్డం రమణారావు,

తోటకూరి వెంకటనరసయ్య, బల్లి వీరయ్య ,మాదిలేని రవి,గడ్డం కోటేశ్వరరావు, దేశ బోయిన ఉపేందర్, నక్కన బోయిన శాంతారావు, సిపిఎం పార్టీ మండల కమిటీ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు,

## భలే భద్రగిరి మార్ట్ ...!

- అటవీ వస్తువులు లభ్యం..
- గిరిజన ఉత్పత్తుల మార్కెట్..
- గ్రామీణ జీవనోపాధికి సాధికారత..
- ఐటీడీఏ పీవో రాహుల్ మరో నూతన ఆవిష్కరణ..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మార్చి 26:** భద్రాచలంలో గిరిజన మ్యూజియం హాట్ టాపిక్. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల కు సజీవ సాక్ష్యం.ఇక ఇప్పుడు గిరిజన ఉత్పత్తులకు భద్రాచలం మార్కెట్ కానుంది. అదే భద్రగిరి మార్ట్. "నూతన ఆవిష్కరణల ఆఫీసర్" గా పేరొందిన భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఐఏఎస్ మరో అద్భుత సృష్టి భద్రగిరి మార్ట్. గ్రామీణ జీవనోపాధికి సాధికారత కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ మార్ట్ నెలకొల్ప బడింది.గిరిజన స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించటం, మార్కెటింగ్ చేయటం ఈ గిరి మార్ట్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశం. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

**భద్రాచలంలో గిరి మార్ట్ ...**

భద్రాచలం పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో భద్రగిరి గిరిమార్ట్ ను ఏర్పాటు చేశారు. గతంలో గిరిజన బజారుగా ఉన్న భవనాన్ని అందచందంగా తీర్చిదిద్దారు. ఇందుకోసం ఐటీడీఏ నిధులను వెచ్చించింది. పట్టణాలకు మాత్రమే పరిమితమైన వివిధ రకాల మార్ట్ లు భద్రాచలంలో కూడా అందుబాటులోకి తీసుకురావాలని ఐటిడిఏ పిఓ బి. రాహుల్ భావించారు.

నూతన వ్యవస్థల సృష్టికర్తగా పేరుందిన రాహుల్ ఐఏఎస్ భద్రగిరి మార్ట్ కు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఐటీడీఏ అధికారుల, ఉద్యోగుల సేవలను వినియోగించారు. గిరిజన మార్ట్ లో సకల సౌకర్యాలు కల్పించారు. అద్భుతంగా భవనాన్ని తీర్చిదిద్దారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ భద్రగిరి మార్ట్ స్థానికులకు ఎంతగానో ఉపకరించనుంది

**గిరిజన ఉత్పత్తుల మార్కెట్ :**

భద్రాచలంలో భద్రగిరి మార్ట్ ఏర్పాటు అద్భుతమనే చెప్పాలి. అడవిలో దొరికేటువంటి ప్రయోజనకరమైన ఎన్నో రకాల అవసర వస్తువులు ఇక్కడ లభ్యం కానున్నాయి. గిరిజన ఉత్పత్తులు, స్వయం సహాయక బృందాల ఉత్పత్తులు, సాధారణ వస్తువులు, వెదురు వస్తువులు, అటవీ తేనే, అడవి పసుపు, పచ్చళ్ళు,స్నాక్స్, హస్తకళలు, హెర్బల్ సబ్బులు, కిరాణా వస్తువులు, చిరుధాన్యాలు, వ్యక్తిగత సంరక్షణ వస్తువులు ఇలా అనేక ప్రజా ఉపయోగకర వస్తువులు ఇక్కడ లభించనున్నాయి. ఈ వస్తువులకు సరసమైన ధరలను కేటాయించి వీటిని విక్రయించేలాగా చర్యలు చేపట్టారు. శ్రీరామనవమి రోజు నుంచి భద్రగిరి మార్ట్ స్థానికులకు అందుబాటులోకి రానుంది.

**రాహుల్ మరో నూతన ఆవిష్కరణ ఇది ...**

భద్రాచలంలో ఐటీడీఏ పీవో రాహుల్ గాంధీ అధికారం చేపట్టినప్పటి నుంచి గిరిజన అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ వస్తున్నారు. భద్రాచలంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు ద్వారా గిరిజన సంస్కృతిని సజీవంగా కాపాడగలిగారు. ట్రైబల్ మ్యూజియం ఒక పిక్నిక్ స్పాట్ గా మారింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో యాత్రికులు ట్రైబల్ మ్యూజియాన్ని దర్శిస్తున్నారు. ఇది ఐటీడీఏకు ఎంతగానో గుర్తింపు తెచ్చింది. గిరిజనుల తమ ఇలవేల్పుల చరితను వెలికి తీసేందుకు రాహుల్ ప్రత్యేక బృందాలతో గిరిజనుల చరితను తెలిపే పుస్తకాలను వెలుగులోకి తీసుకొస్తున్నారు. తెలుగు భాష ఉన్నతికి ఆయన చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఉద్దీపకం పుస్తకం ద్వారా గిరిజన బిడ్డల ఆంగ్ల విద్య ప్రోత్సాహానికి విశేషమైన కృషి చేశారు. ఇలా విద్యారంగానికి పెద్దపీట వేస్తూనే... మరోవైపు గిరిజనుల వ్యవసాయ ప్రగతికి కూడా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా వారు పండించిన పంటలకు, అడవుల్లో దొరికే ఉత్పత్తులకు మార్కెట్ ప్రోత్సాహాన్ని అందించాలనే ఉద్దేశంతో భద్రగిరి మార్టును ఏర్పాటు చేసి మరో నూతన ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకాన్ని సక్సెస్ చేయడం కోసం పిఓ రాహుల్ అహర్నిశల కష్టపడ్డారు. ఈ మార్ట్ ద్వారా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశం కలగనుంది. భద్రాచలానికి వన్నె తెచ్చే విధంగా అనేక నూతన ప్రయత్నాలకు, సక్సెస్ కు వారధిగా నిలుస్తున్న ఐటీడీఏ పిఓ రాహుల్ ను తప్పకుండా అభినందించాల్సిందే

## దక్షిణ అయోధ్య భద్రాద్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పెన్ సత్తా, మార్చి 26:** భక్త రామదాసు నిర్మించిన భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం "దక్షిణ అయోధ్య"గా ప్రసిద్ధి చెందినదని, ఈ పవిత్ర క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. గురువారం భద్రాచలం లోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు విచ్చేయనున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, వీఐపీలు, వివిఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాద పూర్వకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు.

శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్వామివారి కల్యాణం, 28వ తేదీన అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధితో పాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు రహదారులు, రైల్వే, నదీ మార్గాల అభివృద్ధిపై చర్యలు తీసుకుంటున్నామని, అమరావతి జగదల్పూర్ మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని కరకట్టల ఎత్తు పెంపు, ఘాట్‌ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల ఫోటోలను మంత్రి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం మిథిలా స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ అంకిత్ సెక్టార్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలంబ్రాల కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

సెక్టార్ అధికారులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## మక్క రాజుపేట్ దాబాలో కుళ్లిపోయిన మాంసం

దాబా యజమానిని పై చర్యలు తీసుకోవాలి




**చేగుంట పెన్ సత్తా, మార్చి 26:** /కుళ్ళిపోయిన మాంసం దాబాలో వివరాల ప్రకారం, చేగుంట మండల్ మక్కరాజ్‌పేట్ గ్రామంలో గల ఉన్న వై జంక్షన్ ఫ్యామిలీ దాబా వద్ద కుళ్లిపోయిన మాంసం విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. ఈ రోజు మహిళా సంఘాలు మరియు గ్రామ ప్రజలు కలిసి హోటల్‌లో సోదాలు నిర్వహించగా, అక్కడ నిల్వ ఉంచిన మాంసం దుర్వాసనతో కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. ఈ దృశ్యాన్ని చూసిన గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఇలాంటి నాసిరకం ఆహార పదార్థాలు విక్రయించడం అత్యంత ప్రమాదకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామస్థులు సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హోటల్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.ప్రజలు కూడా బయట ఆహారం తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు.

## జగన్నాధపురంలో గ్రామసభ





**చింతకాని పెన్ సత్తా, మార్చి 26:** మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలోని సర్పంచ్ తాళ్ళూరి స్వప్న అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది.

ఈ గ్రామ సభలోని ప్రధానంగా గ్రామ అభివృద్ధి చెందటానికి గ్రామ లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి వివిధ అంశాలపై చర్చించారు. ఈ వేసవి కాలంలోని గ్రామంలోని మంచినీళ్ల సమస్య తలెత్తకుండా, నూతనంగా వాటర్ ప్లాంట్ నిర్మాణం కొరకు, విద్యుత్ దీపాలు, విద్యుత్ స్తంభాలు లేని చోట నిర్మించడం కొరకు, వివిధ అంశాలపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో... వార్డు సభ్యులు, గ్రామ సెక్రెటరీ, గ్రామ పెద్దలు, ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఈ 5 దేశాలకు మాత్రమే ఇరాన్ ఎందుకు అనుమతి ఇచ్చింది.. కారణాలు ఏంటీ..?




పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చిన వేళ.. ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ లాంటి 'హార్ముజ్ జలసంధి'ని ఇరాన్ తన గుప్పిట్లోకి తీసుకుంది. అయితే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ కేవలం భారత్, చైనా, రష్యా, పాకిస్థాన్, ఇరాక్ దేశాల.. ఆయిల్, గ్యాస్ ట్యాంకర్లకు మాత్రమే ఈ మార్గం ద్వారా వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ ఐదు దేశాలకు మాత్రమే ఇరాన్ ఎందుకు మినహాయింపు ఇచ్చిందనే అంశంపై అంతర్జాతీయ విశ్లేషకులు ఆసక్తికర కారణాలను బయటపెడుతున్నారు.

**చైనా, రష్యాలతో మిత్రబంధం:**
ఇరాన్‌కు చైనా అతిపెద్ద ఆర్థిక వెన్నుముక. ఇరాన్ ఉత్పత్తి చేసే చమురులో దాదాపు 90 శాతం చైనానే కొనుగోలు చేస్తోంది. బదులుగా ఇరాన్ మార్కెట్ అంతా చైనా వస్తువులతో పాటు డిఫెన్స్ టెక్నాలజీని ఇరాన్ పొందుతోంది. ఇక రష్యా విషయానికొస్తే.. అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్‌కు సాంకేతిక, ఆయుధ సహకారాన్ని అందిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు వ్యతిరేకంగా అమెరికా నిలవడంతో దానికి ప్రతీకారంగా రష్యా నౌకలకు ఇరాన్ పచ్చజెండా ఊపింది. ఈ రెండు దేశాలు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఇరాన్‌కు అండగా నిలుస్తున్నాయి.

**భారత్ పాకిస్థాన్‌లతో అవసరాలు:**
భారతదేశం నుంచి ఇరాన్‌కు అత్యవసర మందులు, ఇతర నిత్యావసరాలు ఎగుమతి చాలా కీలకం. యుద్ధ సమయంలో అంతర్గత కొరత రాకుండా ఉండేందుకు భారత్‌తో సత్సంబంధాలు ఇరాన్‌కు అవసరం. మరోవైపు పాకిస్థాన్ ఇక్కడ ఒక దౌత్యవేత్త పాత్రను పోషిస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య తెరవెనుక చర్చలు జరపడానికి పాకిస్థాన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. పొరుగు దేశం కావడంతో పాటు ఈ దౌత్యపరమైన అవసరాల దృష్ట్యా పాకిస్థాన్ నౌకలను ఇరాన్ అనుమతిస్తోందట.

**ఇరాక్‌కి ప్రత్యేక పర్మిషన్ ఎందుకంటే..?**
ఇరాక్.. ఇరాన్ దేశాల మధ్య షియా ముస్లిం జనాభా ప్రాబల్యంతో పాటు మతపరమైన అనుబంధం బలంగా ఉంది. ఇరాక్ ప్రభుత్వంలోని అనేక వర్గాలు ఇరాన్‌కు మిత్రపక్షాలుగా ఉన్నాయి. వీటికి తోడు ఇరాక్ తన విద్యుత్, నేచరల్ గ్యాస్ అవసరాల కోసం ఇప్పటికీ ఇరాన్‌పైనే ఆధారపడుతోంది. ఈ పరస్పర ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా.. పొరుగున ఉన్న ఇరాక్‌తో కొత్త తలనొప్పులు కొనితెచ్చుకోకుండా ఇరాన్ ఈ మినహాయింపు ఇచ్చింది. మొత్తానికి తన శత్రువులైన అమెరికా, ఇజ్రాయెల్ మిత్రదేశాల వాణిజ్యాన్ని దెబ్బతీస్తూనే.. తన ఆర్థిక, సైనిక, దౌత్య అవసరాలను తీర్చే 5 దేశాలను ఇరాన్ తన సేఫ్ జోన్ లో ఉంచుకుంది.

# ఆ బంకుల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగాయ్.. !




నిన్న మొన్నటి వరకు ఆ పెట్రోల్ బంకుల్లో ఆయిల్ రేట్లు తక్కువ.. మిగతా పెట్రోల్ బంకులతో పోల్చితే లీటర్ పై 3 నుంచి 5 రూపాయల వరకు తక్కువగా ఉండేవి.. ఇప్పుడు సీన్ మారింది. కానీ నయారా బంకుల్లోనూ పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచారు. ఆ బంకులు ఏంటీ అంటారా.. నయారా పెట్రోల్ బంకులు.. ఖీవీ పెడితే చాలు.. డిస్కౌంట్ రేట్లకే పెట్రోల్ కొట్టించుకోండి అంటూ ఒకటే ప్రచారం.. ఇప్పుడు మిగతా బంకులు మాదిరిగానే ధరలు పెంచేశాయి.
ఇరాన్ యుద్ధ ప్రభావం భారత్‌లోని సామాన్యుడి జేబుపై పడటం మొదలైంది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' పెట్రోలు, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మండుతుండటంతో లీటరుకు పెట్రోలుపై రూ.5, డీజిల్‌పై రూ.3 రేటు పెంచేసింది. స్థానిక పన్నులను బట్టి కొన్ని రాష్ట్రాల్లో ఈ పెరుగుదల లీటరుకు రూ.5.30 వరకు కూడా ఉంది.
పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో నయారా ఎనర్జీ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఇదే క్రమంలో ఏప్రిల్ నుంచి 35 రోజుల పాటు రిఫైనరీ కార్యకలాపాలు నిలిపివేయాలని కంపెనీ నిర్ణయించింది. అయితే దేశంలో ఇంధన కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రష్యాకు చెందిన రోస్నెఫ్ట్ మెజారిటీ వాటాదారుగా ఉన్న నయారా ఎనర్జీ భారత్‌లో సుమారు 7 వేల పెట్రోల్ బంకులను నిర్వహిస్తోంది. పెరిగిన ముడి చమురు ఖర్చులను భరించలేక ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ రంగ సంస్థలైన ×ూజ, ధీూజా, ఌూజా వంటివి నష్టాలను భరిస్తూ ధరలను స్థిరంగా ఉంచినప్పటికీ, ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం నుండి ఎటువంటి నష్టపరిహారం అందదు. అందుకే పెరుగుతున్న నష్టాలను తగ్గించుకునేందుకు నయారా ఈ మార్పులు చేసింది.
ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. ఒక దశలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 119 డాలర్లకు చేరింది. భారత్ తన చమురు అవసరాల్లో 88 శాతాన్ని దిగుమతులపైనే ఆధారపడుతుంది. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి గుండా వచ్చే రవాణాకు ఇరాన్ ఆటంకాలు కలిగిస్తుండటం, ఇన్సూరెన్స్ కంపెనీలు వెనక్కి తగ్గడంతో సరఫరా వ్యవస్థ దెబ్బతింది.
సాధారణ పెట్రోల్ ధరలను ప్రభుత్వ సంస్థలు మార్చకపోయినా.. గత వారమే ప్రీమియం పెట్రోలుపై రూ.2, పారిశ్రామిక అవసరాలకు వాడే బల్క్ డీజిల్‌పై ఏకంగా లీటరుకు రూ.22 మేర ధరలను పెంచేసిన సంగతి తెలిసిందే. యుద్ధం గనుక మరింత కాలం కొనసాగితే.. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా సామాన్యుడు వాడే సాధారణ పెట్రోల్ ధరలను పెంచక తప్పని పరిస్థితి ఏర్పడవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మెడికల్ వ్యాపారంలోకి ఇన్ఫోసిస్ ఎంట్రీ.. 4 వేల కోట్లతో అమెరికా కంపెనీల కొనుగోలు




భారతీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. అమెరికాకు చెందిన రెండు ప్రముఖ సంస్థలు 'ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ', 'స్ట్రాటస్'లను సుమారు 560 మిలియన్ డాలర్ల అంటే మన కరెన్సీలో దాదాపు రూ.4వేల 600 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. మార్కెట్లో టెక్నాలజీ ఖర్చులు తగ్గుతున్న తరుణంలో.. నిర్దిష్ట రంగాల్లో పట్టు సాధించేందుకు ఇన్ఫోసిస్ వేసిన ఈ అడుగు ఐటీ రంగంలో చర్చనీయాంశమైంది.
ఈ రెండు ఒప్పందాలలో అత్యంత కీలకమైనది 'ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ'. ఫ్లోరిడా కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ కోసం ఇన్ఫోసిస్ 465 మిలియన్ డాలర్లు వెచ్చిస్తోంది. హెల్త్‌కేర్ కన్సల్టింగ్ అండ్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో ఆరితేరిన ఈ సంస్థకు 1,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ విభాగంలో ఈ సంస్థకు ఉన్న నైపుణ్యం ఇన్ఫోసిస్ హెల్త్‌కేర్ విభాగం ఆదాయాన్ని భారీగా పెంచనుంది. ఈ సంస్థ ఆదాయం కేవలం ఏడాది కాలంలోనే 106 మిలియన్ డాలర్ల నుంచి 275 మిలియన్ డాలర్లకు పెరగడం ఇన్ఫోసిస్ ను ఆకర్షించింది.
ఇక రెండో సంస్థ 'స్ట్రాటస్'ను 95 మిలియన్ డాలర్లకు ఇన్ఫోసిస్ దక్కించుకుంది. న్యూజెర్సీకి చెందిన ఈ టెక్నాలజీ కన్సల్టింగ్ సంస్థ ఇన్సూరెన్స్ రంగంలో, ముఖ్యంగా ప్రాపర్టీ అండ్ క్యాజువల్టీ విభాగంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. 450 మంది నిపుణులు కలిగిన ఈ సంస్థ.. గైడ్‌వైర్ సంబంధిత సేవలు, క్లౌడ్ మైగ్రేషన్‌లో ఇన్ఫోసిస్ సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ రెండు కొనుగోళ్లు 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నాటికి పూర్తి కానున్నాయి. పెద్ద డీల్స్ కోసం వేచి చూడకుండా.. లాభదాయకమైన చిన్న, మధ్య తరహా సంస్థలను చేజిక్కించుకోవడం ద్వారా క్లౌడ్, డేటా ప్లాట్‌ఫారమ్స్,
కన్సల్టింగ్ విభాగాల్లో ఎదగాలని ఇన్ఫోసిస్ చూస్తోంది. ఏఐ యుగంలో మారుతున్న ఐటీ బిజినెస్ మోడళ్ల కారణంగా కంపెనీ ఇలాంటి దారి ఎంచుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# నిలిచిన బాస్మతీ రైస్ ఎక్స్‌పోర్ట్స్.. ఓడరేవుల్లోనే 10 లక్షల టన్నుల బియ్యం






భారత్ ఏటా సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బాస్మతీ బియ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తోంది. ఇందులో దాదాపు సగానికి పైగా వాటా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలదే. సాధారణంగా
పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధపు సెగలు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారతీయ వ్యవసాయ రంగాన్ని, ముఖ్యంగా బాస్మతీ బియ్యం ఎగుమతి పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీశాయి. ఏటా సుమారు 6 బిలియన్ డాలర్లు అంటే రూ.54వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి తెచ్చి పెట్టే ఈ రంగం.. ప్రస్తుతం రవాణా మార్గాల నిలిపివేత, పేమెంట్ సమస్యలు.. షిప్‌మెంట్‌ల జాప్యంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.
రంజాన్, ఈద్ పండుగల సమయంలో ఈ దేశాలకు ఎగుమతులు భారీ స్థాయిలో ఉంటాయి. అయితే ప్రస్తుత యుద్ధ వాతావరణం వల్ల మధ్యప్రదేశ్ వంటి ప్రధాన బాస్మతీ హబ్‌లలోని రైస్ మిల్లులు వెలవెలబోతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ఎగుమతి సీజన్‌లో ఇప్పుడు నిశ్శబ్దం ఆవరించిందని వారు చెబుతున్నారు. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో ముప్పు పెరగడంతో లాజిస్టిక్స్ రంగం కుదేలైంది. గతంలో ఒక కంటైనర్‌కు 2వేల 500 డాలర్లుగా ఉన్న రవాణా ఖర్చు ఇప్పుడు ఏకంగా 7వేల నుండి 9వేల డాలర్లకు చేరింది. దీనికి తోడు ఇన్సూరెన్స్ ప్రీమియాలు పెరగడం, కంటైనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల టన్నుల బాస్మతీ బియ్యం ఓడరేవుల్లో, గోడౌన్లలో మూలుగుతోంది. ప్రీమియం రకమైన '1121' బాస్మతీకి పశ్చిమాసియాలో ఉన్న డిమాండ్ యూరప్ లేదా ఆఫ్రికా దేశాల్లో ఉండదు. కాబట్టి ఈ నిల్వలను ఇతర మార్కెట్లకు మళ్లించడం కూడా సాధ్యం కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఈ అంతరాయం వల్ల ఎగుమతిదారుల వర్కింగ్ క్యాపిటల్ పూర్తిగా నిలిచిపోయింది. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం సుమారు 2వేల కోట్ల నుండి 25వేల కోట్ల రూపాయల వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. ఇది కేవలం వ్యాపారులకే కాకుండా పరోక్షంగా రైతులపై కూడా ప్రభావం చూపుతోంది. మిల్లులు కొనుగోళ్లు నిలిపివేయడంతో ధాన్యం ధరలు తగ్గే అవకాశం పెరిగింది. ఇది రైతుల ఆదాయాన్ని దెబ్బతీస్తుంది. రాబోయే సాగు సీజన్‌పై కూడా ఈ ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలుస్తోంది. భారత ప్రభుత్వం ఈ దిశగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, పశ్చిమాసియాలో శాంతి నెలకొంటే తప్ప భారత బాస్మతీ ఎగుమతుల ఇంజిన్ మళ్లీ గాడిన పడటం కష్టంగా కనిపిస్తోంది.

# నా ఆరోగ్యాన్ని చెడగొట్టింది గూగుల్, మెటాలే.. టీనేజర్‌కు అమెరికా కోర్టు రూ.50 కోట్లు నష్టపరిహారం



సోషల్ మీడియా దిగ్గజాలు మెటా, గూగుల్ సంస్థలకు అమెరికాలోని లాస్ ఏంజిల్స్ కోర్టు భారీ షాక్ ఇచ్చింది. ప్లాట్‌ఫారమ్‌ల వ్యసనం వల్ల మానసిక ఆరోగ్యానికి నష్టం వాటిల్లిందని ఒక యువతి దాఖలు చేసిన సివిల్ కేసులో ఈ రెండు కంపెనీలు బాధ్యులని జ్యూరీ తీర్పునిచ్చింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

**సోషల్ మీడియా సంస్థలపై కేసు ఏంటి..?**
20 ఏళ్ల వయస్సున్న కేలీ జీఎమ్ అనే యువతి.. తాను చిన్నతనం నుంచి సోషల్ మీడియా వాడకం వల్ల డిప్రెషన్, ఆందోళన, బాడీ డిస్మోర్ఫియా బారిన పడ్డానంటూ కోర్టును ఆశ్రయించింది. 8 రోజుల సుదీర్ఘ చర్చల తర్వాత 12 మంది సభ్యులతో కూడిన జ్యూరీ మెటా, గూగుల్ సంస్థలు ఆమెకు 6 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.50 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. ఇందులో 70 శాతం మెటా సంస్థ, 30 శాతం గూగుల్ చెల్లించాల్సి ఉంటుంది.

**పై కోర్టులో తేల్చుకుంటాం..**
ఈ తీర్పుపై మెటా ప్రతినిధి స్పందిస్తూ.. తాము దీనిపై అప్పీల్ చేస్తామని చెప్పారు. టీనేజర్ల మానసిక ఆరోగ్యం అనేది చాలా సంక్లిష్టమైన అంశమని, దీన్ని కేవలం ఒక యాప్‌తో ముడిపెట్టలేమని మెటా వాదిస్తోంది. గూగుల్ ప్రతినిధి కూడా స్పందిస్తూ.. యూట్యూబ్ అనేది బాధ్యతాయుతమైన స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్ అని, అది సోషల్ మీడియా సైట్ కాదని పేర్కొన్నారు. తమ ప్లాట్‌ఫారమ్‌లు పిల్లల కోసం సురక్షితంగానే రూపొందించబడ్డాయని గూగుల్ చెబుతోంది.

**బయటపడ్డ కంపెనీల సీక్రెట్స్..**
ట్రయల్ సమయంలో మెటా, గూగుల్ సంస్థలకు చెందిన కొన్ని అంతర్గత పత్రాలు బయటపడ్డాయి. అందులో ఒక మెటా ఉద్యోగి "మేము డ్రగ్స్ అమ్మే పుష్షర్ల లాంటి వాళ్లం.. ఇన్‌స్టాగ్రామ్‌కు ప్రజలు ఎంతగా అలవాటు పడుతున్నారంటే అది వారికి రివార్డ్ డెఫిసిట్ డిజార్డర్‌ను కలిగిస్తోంది" అన్న విషయం బయటపడింది. అలాగే టీనేజర్లను ఆకర్షించాలంటే వారిని చిన్నప్పుడే ప్లాట్‌ఫారమ్‌లోకి తీసుకురావాలని యూట్యూబ్ స్ట్రాటజీ మెమోలో ఉన్నట్లు కోర్టు దృష్టికి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లోని బ్యూటీ ఫిల్టర్లు కేలీలో తాను లావుగా ఉన్నాననే భావనను పెంచాయని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు.
ఈ తీర్పు అమెరికా చరిత్రలోనే మొదటిది కావడం విశేషం. ప్రస్తుతం సౌత్ కాలిఫోర్నియాలో గూగుల్, మెటా, టిక్‌టాక్, స్నాప్‌లపై దాదాపు 2,500 మంది ఇలాంటి కంప్లెయింట్స్ చేశారు. బుధవారం వచ్చిన ఈ తీర్పు మిగిలిన కేసులకు ఒక మార్గదర్శిగా మారే అవకాశం ఉందని అమెరికాలోని న్యాయ నిపుణులు అంటున్నారు. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కూడా ఈ విచారణలో సాక్ష్యం ఇచ్చారు. కేలీ తరపు న్యాయవాది మార్క్ లానియర్ మాట్లాడుతూ.. ఈ విజయం సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన తరానికి దక్కిన గొప్ప గౌరవంగా వ్యాఖ్యానించారు.

# గురువారం పెరిగిన గోల్డ్.. శ్రీరామ నవమి ముందు బ్రేక్ తీసుకున్న వెండి




అమెరికా ఇరాన్ యుద్ధం ఇప్పట్లో ఆగేలా అస్సలు కనిపించటం లేదు. దీంతో నిన్నటి వరకూ శాంతి చర్చలపై ఆశలతో గోల్డ్ అండ్ సిల్వర్ ర్యాలీని తిరిగి స్టార్ట్ చేసినప్పటికీ.. గురువారం మళ్లీ చతికిలపడ్డాయి. దీంతో బంగారం రేటు స్వల్పంగా పెరగగా.. మరోపక్క వెండి మాత్రం చలనం లేకుండా ముందుకెళుతోంది. ఈ క్రమంలో షాపింగ్ చేయాలనుకుంటున్న తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తమ ప్రాంతంలో తాజా రేట్లను ముందుగా పరిశీలించాలి.మార్చి 26న బంగారం రేట్లు స్వల్పంగా పెరిగింది. మార్చి 25 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.22 పెరుగుదలను నమోదు చేసింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.14వేల 689గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 465గా తెలుగు రాష్ట్రాల్లోని నగరాల్లో కొనసాగుతోంది. గురువారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. మార్చి 26, 2026న దేశవ్యాప్తంగా స్థిరంగా కొనసాగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు రూ.2లక్షల 60వేల వద్ద కొనసాగుతోంది. అంటే గ్రాము ధర రూ.260 వద్ద ఉంది.

# ఏప్రిల్ నుంచి బైబ్యాక్ లాభాలపై 12% సర్‌చార్జ్

న్యూఢిల్లీ: కంపెనీల బైబ్యాక్ ఆఫర్‌లో షేర్లు విక్రయించే వ్యక్తిగత లేదా కార్పొరేట్ షేర్‌హోల్డర్ల మూలధన లాభాలపై ఏప్రిల్ నుంచి 12 శాతం ఫ్లాట్ సర్‌చార్జ్ పడనుంది. ఇందుకు సంబంధించిన ఫైనాన్స్ బిల్లు-2026 సవరణ బిల్లును లోక్‌సభ తాజాగా ఆమోదించింది. ఇప్పటి వరకు రూ.50 లక్షల వరకు మూలధన లాభంపై సర్‌చార్జ్ ఉండేది కాదు. రూ.50 లక్షల- రూ. కోటి మధ్య 10శాతం పడేది. ఇప్పుడు ఫ్లాట్ 12శాతం విధించడం వల్ల రూ.కోటి కంటే తక్కువ మూలధన లాభం పొందిన వారిపై పన్ను భారం పెరగనుంది. రూ. కోటి కంటే ఎక్కువ లాభాలు పొందిన వారిపై ఉన్న సర్‌చార్జ్ 15శాతం నుంచి 12శాతానికి తగ్గుతుంది. కార్పొరేట్ షేర్‌హోల్డర్లపై కూడా ప్రభావం ఉంటుంది. రూ. కోటి వరకు లాభంపై ముందుగా సర్‌చార్జ్ లేదు. ఇక నుంచి పడుతుంది. మొత్తంగా బైబ్యాక్ మూల ధన లాభం ఎంత ఉన్నా 12 శాతం ఫ్లాట్ సర్‌చార్జీ కార్పొరేట్, వ్యక్తిగత షేర్‌హోల్డర్లపై పడుతుంది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## నగరాభివృద్ధికి ప్రజారవాణా కీలకం

విశ్వనగరంగా పేరుగాంచిన గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో రవాణా వ్యవస్థకు విశేషమైన స్థానముంది. నగరం విస్తరణతోపాటు రవాణా వ్యవస్థలు కూడా పెరగాల్సిన ఆవశ్యకత ఉంటుంది. వేగంగా అభివృద్ధి చెందుతూ మెట్రోపాలిటన్ సిటీగా ప్రత్యేక గుర్తింపు పొందిన హైదరాబాద్‌లో రోజూ లక్షలాదిమంది పలు అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తుండటంతో నగరానికి సమర్థవంతమైన రవాణా వ్యవస్థ అవసరం ఎంతైనా ఉంది. కాలుష్యం, ట్రాఫిక్ పద్మవ్యూహం లేకుండా తక్కువ ఖర్చుతో నగరంలో ప్రయాణం సాగించాలంటే వ్యక్తిగత వాహనాలకంటే ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలి. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రజా రావాణాలో భాగంగా కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్ర ఆర్‌టిసి బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటిఎస్ సర్వీసులు వేగంగా విస్తరిస్తున్న నగర ప్రజల అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో 2050 నాటికి ప్రజా రవాణా వ్యవస్థను నగరానికి సరిపోయేలా వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం ఆహ్వానించదగ్గ పరిణామం. చరిత్రాత్మక హైదరాబాద్ నగరంలో నిజాం కాలం నుండే ప్రజా రవాణా వ్యవస్థ విస్తృతంగా అందుబాటులో ఉండేది. గుర్రపు బండ్ల టాంగాలతో మొదలైన హైదరాబాద్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కాలక్రమేణా అభివృద్ధి చెందింది. నిజాం స్టేట్ రైల్వే నేతృత్వంలో 1870లో నగరంలో రైల్వే వ్యవస్థ ప్రారంభమైంది. భారత దేశంలోని తొలిసారిగా 1932లో నిజాం ప్రభుత్వం బస్సు సేవలను ప్రారంభించింది. లండన్ నుండి పాత బస్సులను తెప్పించి నగరంలో తిప్పారు. ఒక్కో బస్సులు 15 నుండి 20 మంది ప్రయాణికులు ప్రయాణించేవారు. తొలుతగా 27 బస్సులు, 160 మందికిపైగా సిబ్బందితో ప్రారంభించిన ప్రజా రవాణా వ్యవస్థ యావత్ దేశానికి స్ఫూర్తిగా నిలిచింది.ప్రజా రవాణా వ్యవస్థలో ఘన చరిత్ర గల హైదరాబాద్‌లో కాలానికి అనుగుణంగా ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నా వేగవంతంగా విస్తరిస్తున్న నగరం, పెరుగుతున్న జనాభాకు సరిపోవడం లేదు. నగరం నలువైపులా శివార్లలోని బస్తీలు, కాలనీల వరకు ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. సిటీలో వేగవంతమైన ప్రయాణం కోసం మూడు మార్గాల్లో మెట్రో రైలు పరిగెడుతోంది.

అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే సరసమైన ధరలో ఎంఎంటిఎస్ సేవలు అందిస్తోంది. అయినా హైదరాబాద్ బృహత్ నగరం జనాభా కోటిన్నరకు చేరుకుంటున్న దశలో ప్రస్తుత ప్రజా రవాణా వ్యవస్థ ప్రజావసరాలను తీర్చడంలేదని కచ్చితంగా చెప్పవచ్చు. సరిపోని ప్రజా రవాణాతో ప్రజలు ప్రయివేట్, వ్యక్తిగత వాహనాల రవాణా వైపు చూడాల్సి వస్తుంది. వాహనాల పెరుగుదలతో నగరంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనాభా, వాహనాల సంఖ్యకు తగ్గట్టు రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్, కాలుష్య సమస్యలొస్తున్నాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్‌ఎంఎ) 2050 సమగ్ర మొబిలిటి ప్లాన్ (సిఎంపి)కి సర్వేలో వెల్లడైన వివరాల ప్రకారం 2024 ఆగస్టు 31నాటికి నగరంలో 92.13 లక్షల వాహనాలుండగా, వాటిలో కార్లు 16.15 లక్షలు, ద్విచక్రవాహనాలు 67.58 లక్షలున్నాయి. భారీగా సొంత వాహనాలతో నగరంలో కాలుష్యం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 100 నుండి 170 మధ్య ఉండడం ప్రమాదకరాన్ని హెచ్చరిస్తోంది. రోడ్లపై అధిక వాహనాల ప్రయాణంతో నగరంలో సాధారణ సమయాల్లో 10 కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట, పీక్ సమయాల్లో గంటకు 16 కిలోమీటర్ల ప్రయాణమే సాధ్యమవుతుండడంతో ట్రాఫిక్ సమస్యను కళ్లకు కడుతున్నాయి. గ్రేటర్ నగరంలో ప్రస్తుతమున్న ప్రజా రవాణా, మౌలిక వసతులు సరిపోవడం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రోజూ 32,000 వేల ట్రిప్పుల సర్వీసులతో మూడు వేలకుపైగా ఆర్‌టిసి బస్సులు 25 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నా కిక్కిరిసిపోతుండడంతో ప్రజలు ఎక్కడానికి భయపడుతున్నారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి, రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల కష్టాలు రెట్టింపయ్యాయి. మియాపూర్ నుండి ఎల్‌బినగర్ వరకు, జెబిఎస్ నుండి ఎంజిబిఎస్ వరకు, నాగోల్ నుండి రాయదుర్గం వరకు మూడు మార్గల్లో సుమారు 70 కిలోమీటర్లలో 57 స్టేషన్ల మీదుగా మెట్రో రైలు ప్రయాణికులు సేవలందిస్తున్నా రద్దీ సమయాల్లో అక్కడ కాలుపెట్టే పరిస్థితులు కూడా ఉండడం లేదు. మరో వైపు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ఎంఎంటిఎస్ రైళ్లు సుమారు 120 కిలోమీటర్ల పైగా సేవలందిస్తున్నాయి. ఈ రైళ్లలో తక్కువ ధరతో ప్రయాణం లభిస్తున్నా ఉన్న కొద్ది మార్గంలో కూడా సమయపాలన పాటించకపోవడంతో నగర వాసులకు వీటిపై భరోసా లేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ మూడు ప్రజా రవాణా వ్యవస్థలు నగర ప్రయాణికులకు ఏమాత్రం సరిపోకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా ప్రజారవాణా అభివృద్ధి ఆవశ్యకత గుర్తించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించి ఆచరణలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనికి ఏటా రూ. 15 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంటుంది. 2026 నుండి 2025 వరకు మెట్రో కోసం రూ. 1,65,873 కోట్లు, ఎంఎంటిఎస్ కోసం రూ. 22,378 కోట్లు, బస్సుల కోసం రూ. 7336 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని నివేదికలు చెబుతున్నాయి. నగర ప్రజారవాణాపై ఆర్థిక అభివృద్ధి ప్రణాళిక (ఇడిపి), సిఎంపి 2050 వరకు చేపట్టాల్సిన పలు ప్రణాళికలను బ్లూ, గ్రీన్ విభాగాలుగా విభజించి ప్రతిపాదించింది. 2050 వరకు సమగ్ర రవాణా ప్రణాళిక అమలు కోసం రూ. 4 లక్షల కోట్లు అవసరమని గుర్తించారు. నగరంలో మెట్రో రైలును మూడు దశల్లో 2050 నాటికి 556.6 కిమీలకు, ఎంఎంటిఎస్ నెట్‌వర్క్‌ను 2050 నాటికి 336.4 కిమీలకు విస్తరించాలని ప్రతిపాదించారు. ప్రత్యేక బస్ మార్గాలను ఏర్పాటు చేయడంతోపాటు బిఆర్‌టిఎస్, డిబిఎల్ సదుపాయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 2050 నాటికి 7 బస్, ట్రక్ టెర్మినళ్లు ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా 29 చోట్ల వంతెనలు నిర్మించనున్నారు. 2030 నుండి 2040 వరకు, పిమ్మట 2050 వరకు దశలవారీగా కొత్త రోడ్లు, హైవేలు, 18 మీటర్ల కారిడార్లు మొత్తం మీద 2050 నాటికి నగరంలో 19 వేల కిమీలకు పైగా రోడ్ నెట్‌వర్క్‌ను పెంచేందుకు ప్రణాళిక్లు రూపొందించారు. అంతేకాక 2050 నాటికి 75 గ్రేడ్ సెపరేటర్లు, 120 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కైవాక్‌లు, 34 ఆరఒబిలు, 16 ఆర్‌యుబిలు, 8 చోట్ల ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందకు విస్తృతమైన ప్రణాళికలను రూపొందించారు.

# బీట్‌రూట్..ఈ సమస్యలు ఉన్నవారు తాగితే రిస్క్



బీట్‌రూట్.. పోషకాల గని. ఇందులో ఉండే ఫోలేట్, పొటాషియం, విటమిన్–సి వంటి పోషకాలు శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. రక్తాన్ని పెంచడానికి, చర్మాన్ని మెరుగుపరచడానికి చాలా మంది బీట్‌రూట్ జ్యూస్‌ను క్రమం తప్పకుండా తీసుకుంటారు. అయితే ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ పోషకమైన జ్యూస్ అందరికీ సరిపడదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇది ప్రయోజనానికి బదులుగా హాని కలిగించే అవకాశం ఉంది. కిడ్నీలో రాళ్ల సమస్య : ఎవరికైతే కిడ్నీలో రాళ్లు ఉన్నాయో లేదా గతంలో ఆ సమస్యతో బాధపడ్డారో, వారు బీట్‌రూట్ జ్యూస్ తాగకపోవడమే మంచిది. బీట్‌రూట్‌లో ఆక్సలేట్ అనే మూలకం అధికంగా ఉంటుంది. ఇది కిడ్నీలో రాళ్ల సమస్యను మరింత తీవ్రతరం చేయడమే కాకుండా, కొత్తగా రాళ్లు ఏర్పడటానికి కారణమవుతుంది. తక్కువ రక్తపోటు: బీట్‌రూట్ సహజంగానే రక్తపోటును తగ్గించే గుణాన్ని కలిగి ఉంటుంది. ఇది హై బీపీ ఉన్న రోగులకు వరప్రసాదం లాంటిది. కానీ, ఇప్పటికే లో బీపీతో బాధపడేవారు దీనిని తీసుకుంటే రక్తపోటు మరింత పడిపోయి, నీరసం లేదా కళ్లు తిరగడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. బలహీనమైన జీర్ణశక్తి: తరచుగా కడుపు నొప్పి, గ్యాస్ లేదా ఉబ్బరం వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారు బీట్‌రూట్ రసానికి దూరంగా ఉండాలి. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణక్రియ మందగించి, కడుపులో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది.

అలర్జీ సమస్యలు: అలర్జీలు ఉన్నవారికి బీట్‌రూట్ రసం ఒక్కోసారి వికటించవచ్చు. దీనివల్ల చర్మంపై దురద, ఎర్రటి దద్దుర్లు లేదా చికాకు కలగవచ్చు. కొంతమందిలో వికారం లేదా వాంతులు వంటి దుష్ప్రభావాలు కూడా కనిపించవచ్చు. ఏదైనా అతిగా తీసుకుంటే అది హాని కలిగిస్తుందనేది మరువకూడదు. బీట్‌రూట్ జ్యూస్ మీ శరీరానికి సరిపడుతుందో లేదో తెలుసుకోవడానికి తక్కువ పరిమాణంలో ప్రారంభించడం లేదా మీ వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.

# ఆరోగ్యానికి ప్రకృతి ఇచ్చిన వరం



మారుతున్న జీవనశైలి, గంటల తరబడి కూర్చుని పనిచేయడం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల ప్రస్తుతం చాలా మంది ఎముకల సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా 30 ఏళ్లు దాటిన తర్వాత ఎముకల సాంద్రత తగ్గడం ప్రారంభమై, అవి బలహీనపడే ప్రక్రియ వేగవంతమవుతుంది. దీనివల్ల కీళ్ల నొప్పులు, ఆస్టియోపొరోసిస్ వంటి వ్యాధుల ముప్పు పెరుగుతోంది. అయితే మన వంటింట్లో దొరికే మెంతులు ఈ సమస్యలకు అద్భుత పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు. ఎముకలకు మెంతులు: నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ నివేదికల ప్రకారం.. మెంతులు ఎముకల ఆరోగ్యానికి ఒక శక్తివంతమైన ఔషధంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే పోషకాలు ఎముకలను దృఢంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మెంతుల్లో కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, ఇనుము పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముక సాంద్రతను పెంచి, విరిగే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఎముకలు విరిగినప్పుడు లేదా దెబ్బతిన్నప్పుడు.. అవి త్వరగా కోలుకోవడానికి మెంతులు సహాయపడతాయి. ఇందులోని శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ గుణాలు కీళ్లవాతం, కీళ్ల నొప్పి, వాపును తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఎలా తీసుకోవాలి?: ఎముకల బలాన్ని పెంచుకోవడానికి మెంతులను ఈ పద్ధతుల్లో తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒక టీస్పూన్ మెంతులను రాత్రంతా ఒక గ్లాసు నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే పరగడుపున ఆ నీటిని తాగి, గింజలను నమిలి తినడం వల్ల పూర్తి ప్రయోజనం లభిస్తుంది. అంతేకాకుండా మెంతులను దోరగా వేయించి, పొడిగా నూరి పెట్టుకోవాలి. ఈ పొడిని ప్రతిరోజూ ఉదయం గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవచ్చు. 30 ఏళ్లు దాటిన వారు: ఎముకలు బలహీనపడకుండా ఉండాలంటే కేవలం చిట్కాలు మాత్రమే సరిపోవు. మీ ఆహారంలో కాల్షియం మరియు విటమిన్ డి సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఉదయం పూట ఎండలో కాసేపు గడపడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎముకల ఆరోగ్యం కోసం మెంతులతో పాటు కాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం. ఏదైనా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుని సలహాతోనే ఈ మార్పులు చేసుకోవడం ఉత్తమం.

# మండే వేసవిలో పవర్‌ఫుల్ పండు



ఎండలు దంచికొడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు.. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం ఉత్తమం.. ముఖ్యంగా సరిపడినంత నీరు తాగడం అలాగే.. మంచి ఆరోగ్యకరమైన పండ్లు తీసుకోవడం ఉత్తమం.. అలాంటి అద్భుతమైన పండ్లలో కర్బూజ ఒకటి.. ఇది తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు..వేసవికాలం వచ్చేసింది.. ఎండలు దంచికొడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు.. డీహైడ్రేషన్ బారిన పడకుండా.. హైడ్రేషన్ గా ఉండేందుకు .. మంచి పండ్లను తీసుకోవడం మంచిది.. అలాంటి అద్భుతమైన పండ్లలో కర్బూజ ఒకటి.. ఇది వేసవిలో శరీరానికి అద్భుతమైన చలువ చేస్తుంది.. ఈ పండులో అధిక నీటి శాతం ఉంటుంది.. దీనిలో 90శాతానికి పైగా నీరు.. డీహైడ్రేషన్‌ను నివారించేలా సహాయపడుతుంది.

శరీరంలోని వేడి తగ్గుతుంది: కర్బూజ అద్భుతమైన పండు.. ఇది వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, శరీరాన్ని చల్లబరుస్తుంది, ఎండదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది: కర్బూజను తీసుకుంటే.. రక్తపోటు అదుపులో ఉండటంతోపాటు.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.. దీనిలో ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో.. అలాగే రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో సహాయపడుతుంది. కడుపు సమస్యలకు చెక్: వేసవి కాలంలో తరచూ గ్యాస్, అజీర్తి, మలబద్దకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు బాధపడుతుంటారు.. అయితే, ఈ సీజన్‌లో సులభంగా జీర్ణమయ్యే కర్బూజను తినడం ద్వారా.. కడుపు సమస్యలకు చెక్ పెట్టవచ్చు.. కంటి ఆరోగ్యం: కర్బూజ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.. అలాగే.. కంటికి సంబంధించిన సమస్యలు కూడా దూరమవుతాయి.. దీనిలోని విటమిన్ ఎ బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతాయి.లైంగిక సమస్యలు: కర్బూజలో విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. అందువల్ల ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని రెగ్యులర్ గా తినడం వల్ల లైంగిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారు కర్బూజను తీసుకుంటే.. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.. అలాగే.. కర్బూజ బరువును తగ్గడంలో.. చర్మ ఆరోగ్యానికి బాగా సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు. అయితే.. ప్రతి రోజూ కర్బూజను తినడం వల్ల ఇలా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొంటున్నారు.

# చెరుకు, పుచ్చకాయ రసం.. సమ్మర్‌లో ఆరోగ్యానికి ఏది మంచిది..?



వేసవి కాలం తన ప్రతాపాన్ని చూపిస్తోంది. శరీరంలోని నీటి శాతం తగ్గిపోకుండా ఉండాలంటే కేవలం నీళ్లు తాగితే సరిపోదు, సరైన పోషకాలు కూడా అందాలి. మార్కెట్లో అందరికీ అందుబాటులో ఉండే చెరకు రసం తక్షణ శక్తిని ఇస్తుందా..? లేక 90శాతం నీటి శాతం ఉండే పుచ్చకాయ రసం దాహాన్ని తీరుస్తుందా? భానుడు భగభగమంటున్నాడు. మార్చి నెలలోనే ఎండలు ముదురుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శరీరంలోని నీటి శాతం తగ్గిపోకుండా కాపాడుకోవడానికి పానీయాల అవసరం పెరిగింది. అయితే మార్కెట్లో దొరికే కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే, పోషకాలు నిండిన సహజ రసాల వైపు మొగ్గు చూపాలని నిపుణులు సూచిస్తున్నారు. అందులో చెరుకు రసం, పుచ్చకాయ రసం బెస్ట్ అని చెప్పాలి.చెరకు రసం: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం.. చెరకు రసంలో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఎండలో తిరిగి అలసిపోయిన వారికి ఇది ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. పరిశోధనల ప్రకారం.. చెరకు రసాన్ని 35 నుండి 15 డిగ్రీల సెల్సియస్‌కు చల్లబరచి తాగడం వల్ల అందులోని పోషకాలు దెబ్బతినకుండా శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి. ఇందులోని పీచు పదార్థం వేసవిలో మందగించే జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయ రసం: కేవలం నీటి శాతం ఆధారంగా చూస్తే, పుచ్చకాయ రసం వేసవిలో అత్యంత అద్భుతమైన పానీయం. ఇందులో దాదాపు 90శాతం నీరు ఉంటుంది. విటమిన్ ఎ, సి మరియు లైకోపీన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఇందులో ఉంటాయి. శరీరానికి తేమను అందించి, దాహాన్ని తీర్చడంలో పుచ్చకాయ రసం ముందుంటుంది. ఇది వాపును తగ్గించి, చర్మ సౌందర్యానికి, గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఏది ఎంచుకోవాలి?: మీరు చేసే పనిని బట్టి ఎంపిక ఉండాలని న్యూట్రియెంట్స్ జర్నల్ పేర్కొంటోంది. ఎండలో శ్రమించే కార్మికులు లేదా ప్రయాణికులకు కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి చెరకు రసం ఉత్తమం. అధిక వేడి వల్ల ఒంట్లో నీరు తగ్గిపోయినట్లు అనిపిస్తే, తక్షణ హైడ్రేషన్ కోసం పుచ్చకాయ రసం బెస్ట్ ఛాయిస్. నిపుణుల సూచనలు: రసాన్ని తీసే విధానం వల్ల పోషకాలు దెబ్బతినకుండా ఉంటాయి. అయితే రసం తీసేటప్పుడు ఉపయోగించే నీటి నాణ్యత, పరిశుభ్రత చాలా ముఖ్యం. తక్షణ దాహం తీర్చుకోవడానికి ఎప్పుడూ శుభ్రమైన తాగునీటిని వెంట ఉంచుకోవాలి.





| Match No | Date | Day | Start | Home | Away | Venue |
|---|---|---|---|---|---|---|
| 36 | 25-APR-26 | Sat | 7:30 PM | Rajasthan Royals | Sunrisers Hyderabad | Jaipur |
| 37 | 26-APR-26 | Sun | 3:30 PM | Gujarat Titans | Chennai Super Kings | Ahmedabad |
| 38 | 26-APR-26 | Sun | 7:30 PM | Lucknow Super Giants | Kolkata Knight Riders | Lucknow |
| 39 | 27-APR-26 | Mon | 7:30 PM | Delhi Capitals | Royal Challengers Bengaluru | Delhi |
| 40 | 28-APR-26 | Tue | 7:30 PM | Punjab Kings | Rajasthan Royals | New Chandigarh |
| 41 | 29-APR-26 | Wed | 7:30 PM | Mumbai Indians | Sunrisers Hyderabad | Mumbai |
| 42 | 30-APR-26 | Thu | 7:30 PM | Gujarat Titans | Royal Challengers Bengaluru | Ahmedabad |
| 43 | 01-MAY-26 | Fri | 7:30 PM | Rajasthan Royals | Delhi Capitals | Jaipur |
| 44 | 02-MAY-26 | Sat | 7:30 PM | Chennai Super Kings | Mumbai Indians | Chennai |
| 45 | 03-MAY-26 | Sun | 3:30 PM | Sunrisers Hyderabad | Kolkata Knight Riders | Hyderabad |
| 46 | 03-MAY-26 | Sun | 7:30 PM | Gujarat Titans | Punjab Kings | Ahmedabad |
| 47 | 04-MAY-26 | Mon | 7:30 PM | Mumbai Indians | Lucknow Super Giants | Mumbai |
| 48 | 05-MAY-26 | Tue | 7:30 PM | Delhi Capitals | Chennai Super Kings | Delhi |
| 49 | 06-MAY-26 | Wed | 7:30 PM | Sunrisers Hyderabad | Punjab Kings | Hyderabad |
| 50 | 07-MAY-26 | Thu | 7:30 PM | Lucknow Super Giants | Royal Challengers Bengaluru | Lucknow |
| 51 | 08-MAY-26 | Fri | 7:30 PM | Delhi Capitals | Kolkata Knight Riders | Delhi |
| 52 | 09-MAY-26 | Sat | 7:30 PM | Rajasthan Royals | Gujarat Titans | Jaipur |
| 53 | 10-MAY-26 | Sun | 3:30 PM | Chennai Super Kings | Lucknow Super Giants | Chennai |
| 54 | 10-MAY-26 | Sun | 7:30 PM | Royal Challengers Bengaluru | Mumbai Indians | Raipur |
| 55 | 11-MAY-26 | Mon | 7:30 PM | Punjab Kings | Delhi Capitals | Dharamshala |
| 56 | 12-MAY-26 | Tue | 7:30 PM | Gujarat Titans | Sunrisers Hyderabad | Ahmedabad |
| 57 | 13-MAY-26 | Wed | 7:30 PM | Royal Challengers Bengaluru | Kolkata Knight Riders | Raipur |
| 58 | 14-MAY-26 | Thu | 7:30 PM | Punjab Kings | Mumbai Indians | Dharamshala |
| 59 | 15-MAY-26 | Fri | 7:30 PM | Lucknow Super Giants | Chennai Super Kings | Lucknow |
| 60 | 16-MAY-26 | Sat | 7:30 PM | Kolkata Knight Riders | Gujarat Titans | Kolkata |
| 61 | 17-MAY-26 | Sun | 3:30 PM | Punjab Kings | Royal Challengers Bengaluru | Dharamshala |
| 62 | 17-MAY-26 | Sun | 7:30 PM | Delhi Capitals | Rajasthan Royals | Delhi |
| 63 | 18-MAY-26 | Mon | 7:30 PM | Chennai Super Kings | Sunrisers Hyderabad | Chennai |
| 64 | 19-MAY-26 | Tue | 7:30 PM | Rajasthan Royals | Lucknow Super Giants | Jaipur |
| 65 | 20-MAY-26 | Wed | 7:30 PM | Kolkata Knight Riders | Mumbai Indians | Kolkata |
| 66 | 21-MAY-26 | Thu | 7:30 PM | Chennai Super Kings | Gujarat Titans | Chennai |
| 67 | 22-MAY-26 | Fri | 7:30 PM | Sunrisers Hyderabad | Royal Challengers Bengaluru | Hyderabad |
| 68 | 23-MAY-26 | Sat | 7:30 PM | Lucknow Super Giants | Punjab Kings | Lucknow |
| 69 | 24-MAY-26 | Sun | 3:30 PM | Mumbai Indians | Rajasthan Royals | Mumbai |
| 70 | 24-MAY-26 | Sun | 7:30 PM | Kolkata Knight Riders | Delhi Capitals | Kolkata |

# పూర్తి షెడ్యూల్ వచ్చేసింది



ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. ఇంతకుముందు తొలి దశలో కేవలం 20 మ్యాచులకు మాత్రమే వేదికలు, తేదీలను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో దశలో 50 మ్యాచులకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో మొత్తం 70 లీగ్ మ్యాచులకూ షెడ్యూల్ ప్రకటించినట్లైంది. అయితే, ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. మార్చి 28 నుంచి మే 24 వరకూ జరగనున్న లీగ్ స్టేజ్ మ్యాచ్‌ల వివరాలను ప్రకటించింది. బెంగళూరు వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌తో 19వ ఎడిషన్ ప్రారంభం కానుంది. లీగ్ స్టేజ్ కోల్‌కతా నైట్‌రైడర్స్ జం దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో ముగియనుంది. ఈ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుంది.

**క్యాచులపై క్లారిటీ**

క్యాచుల విషయంపై ఇప్పటికే పది జట్ల సారథులకు బీసీసీఐ క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కెప్టెన్లతో జరిగిన సమావేశంలో అందుకు సంబంధించిన వీడియోలను ప్లే చేసి చూపించారని సమాచారం. క్లాజ్ 33.3 ప్రకారం బంతిపై ఫీల్డర్‌కు పూర్తి నియంత్రణ వచ్చినట్లు అంపైర్లు భావిస్తేనే ఔట్ ఇవ్వడం జరుగుతుందని బీసీసీఐ స్పష్టం చేసింది. అందుకోసం గత టీ20 ప్రపంచ కప్‌లో కాస్త చర్చకు దారితీసిన  క్యాచుల వీడియోలను ప్రదర్శించింది.

# టీమ్‌ఇండియా షెడ్యూల్.. హైదరాబాద్‌లో రెండు మ్యాచ్‌లు

## 2026-27 షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ

దిల్లీ: 2026-27 సీజన్‌లో సొంతగడ్డపై జరిగే అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను గురువారం బీసీసీఐ ప్రకటించింది. రానున్న సీజన్‌లో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత్‌లో పర్యటించనున్నాయి. ఈ పర్యటనల్లో భారత్ 17 నగరాల్లో 22 మ్యాచ్‌లు ఆడనుంది. అందులో 5 టెస్టులు, 9 వన్డేలు, 8 టీ20లు ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది సెప్టెంబరు 27న వెస్టిండీస్ పర్యటనతో స్వదేశీ సీజన్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌లో మూడు వన్డేలు.. అయిదు టీ20ల్లో భారత్, విండీస్ తలపడతాయి. అక్టోబరు 14న ఉప్పల్ స్టేడియంలో నాలుగో టీ20 జరగనుంది. మిగతా మ్యాచ్‌లకు వరుసగా త్రివేండ్రం, గువాహటి, చండీగఢ్, లఖ్‌నవూ, రాంచి, ఇండౌర్, బెంగళూరు వేదికలుగా నిలవనున్నాయి. డిసెంబరు 13 నుంచి 27 వరకు శ్రీలంకతో మూడేసి వన్డేలు, టీ20లకు వరుసగా దిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్, రాజ్‌కోట్, కటక్, పుణె ఆతిథ్యమివ్వనున్నాయి.. 2027 జనవరి 3న మొదలయ్యే జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను వరుసగా కోల్‌కతా, హైదరాబాద్ (జనవరి 6న), ముంబయిలలో నిర్వహించనున్నారు. 2027 జనవరి 21న బోర్డర్- గావస్కర్ ట్రోఫీ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌లో అయిదు టెస్టు మ్యాచ్‌లకు నాగ్‌పుర్, చెన్నై, గువాహటి, రాంచి, అహ్మదాబాద్ వేదికలుగా నిలువనున్నాయి. గత కొంతకాలంగా కీలక మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తున్న విశాఖపట్నానికి 2026-27 సీజన్‌లో ఒక్కటి కూడా కేటాయించలేదు.



**షాలినీ పాండే నేచురల్ బ్యూటీ ఫోకస్**

# హీరోగా తొలి ప్రయత్నంలో బ్లాక్ బాస్టర్ సక్సెస్ అందుకున్న డైరెక్టర్స్ వీళ్లే!

సినిమా ఇండస్ట్రీలో ఒక్కోసారి ఊహించని మలుపులు చోటుచేసుకుంటాయి. యాక్షన్ అని చెప్పే దర్శకులే మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చి హీరోలుగా మారడం మనం చూస్తూనే ఉంటాం. అయితే, డైరెక్షన్ సీటు వదిలి హీరోగా అదృష్టాన్ని పరీక్షించుకుని, మొదటి సినిమాతోనే బాక్సాఫీస్ దగ్గర బ్లాక్‌బస్టర్ హిట్లు కొట్టిన కొందరు టాలెంటెడ్ దర్శకుల గురించి మీకు తెలుసా? మెగాఫోన్ పట్టిన చేతులతోనే మెగా హిట్లు కొట్టి హీరోలుగా సెటిల్ అయిన ఆ స్టార్ డైరెక్టర్ల సక్సెస్ స్టోరీస్ ఇప్పుడు చూద్దాం..

**క్రేజీ కాన్సెప్ట్‌లతో కట్టిపడేసిన యంగ్ డైరెక్టర్స్:**

ప్రస్తుత తరం దర్శకుల్లో ప్రదీప్ రంగనాథన్ పేరు మారుమోగిపోతోంది. 'కోమాలి' సినిమాతో డైరెక్టర్‌గా సత్తా చాటిన ఈ కుర్రాడు, తన రెండో సినిమా 'లవ్ టుడే'తో హీరోగా మారిపోయాడు. యువతకు కనెక్ట్ అయ్యే కథతో వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసి ఓవర్‌నైట్ స్టార్ అయ్యాడు. ఇక మన తెలుగు డైరెక్టర్ తరుణ్ భాస్కర్ కూడా 'పెళ్లి చూపులు'తో సెన్సేషన్ క్రియేట్ చేసి, ఆ తర్వాత 'మీకు మాత్రమే చెప్తా' సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకున్నాడు. వీరు కేవలం డైరెక్షన్‌లోనే కాదు, యాక్టింగ్‌లో కూడా తమదైన మార్క్ చూపిస్తూ యూత్‌లో భారీ క్రేజ్ సంపాదించుకున్నారు.



**వారి సక్సెస్ సీక్రెట్ ఇదే:**

ఈ డైరెక్టర్లందరూ హీరోలుగా సక్సెస్ అవ్వడానికి ప్రధాన కారణం వారికి సినిమాపై ఉన్న ఇష్టం. కథలో ఏ ఎమోషన్ పండుతుందో, ఆడియన్స్‌కి ఏం కావాలో వారికి బాగా తెలుసు. అందుకే వారు హీరోలుగా మారినప్పుడు పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి ఆకట్టుకుంటున్నారు. ఇక వీరు కేవలం ఒక్క సినిమాకే పరిమితం కాకుండా హీరోలుగా వరుస అవకాశాలు అందుకుంటూ, అటు డైరెక్షన్‌ను ఇటు యాక్టింగ్‌ను బ్యాలెన్స్ చేస్తున్నారు. డైరెక్టర్ విజన్ కలిగిన హీరోలు కాబట్టే వీరి సినిమాలు నాచురల్ కు దగ్గరగా ఉంటూ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

దర్శకత్వం వహించడం

ఒక ఎత్తు అయితే, కెమెరా ముందు నటిస్తూ మెప్పించడం మరో ఎత్తు. కానీ ఈ టాలెంటెడ్ డైరెక్టర్లు ఆ రెండు పడవల ప్రయాణాన్ని సక్సెస్ ఫుల్ గా సాగిస్తున్నారు. అటు మెగాఫోన్ పట్టినా.. ఇటు మేకప్ వేసినా.. వారి లక్ష్యం మాత్రం ప్రేక్షకులను అలరించడమే.

**లెజెండరీ దర్శకుల సంచలన అడుగులు:**

ఒకప్పుడు డైరెక్టర్‌గా కల్ట్ క్లాసిక్ సినిమాలు తీసిన ఉపేంద్ర, ఎస్.జె. సూర్య వంటి వారు హీరోలుగా మారి సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. కన్నడ ఇండస్ట్రీలో తన మార్క్ డైరెక్షన్‌తో షేక్ చేసిన ఉపేంద్ర, అప్పట్లో 'ఎ' సినిమాతో హీరోగా మారి సెన్సేషనల్ హిట్ అందుకున్నారు. ఇప్పటికీ ఆ సినిమా ఒక ట్రెండ్ సెట్టర్. అలాగే తమిళంలో 'వాలి', 'ఖుషి' వంటి బ్లాక్‌బస్టర్లు తీసిన ఎస్.జె. సూర్య, 'న్యూ' అనే సినిమాతో హీరోగా మారి తన విలక్షణ నటనతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక రీసెంట్‌గా అభిషన్ జీవింత్ 'టూరిస్ట్ ఫ్యామిలీ' తర్వాత 'జీవింత్ విత్ లవ్' చిత్రంతో హీరోగా మారి తొలి సినిమాతోనే మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు.

# తమన్నా 'వ్వాన్'పై తాజా అప్‌డేట్.. రిలీజ్ లేట్

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా తన కెరీర్‌ను మళ్లీ గాడిలో పెట్టేందుకు 'వ్వాన్' (ఎఋఖఅ) అనే ఇంటెన్స్ ఫోక్ థ్రిల్లర్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటిస్తున్న ఈ సినిమా మే 15న సమ్మర్ కానుకగా విడుదల కావాల్సి ఉండగా, తాజాగా వాయిదా పడింది. విజువల్ ఎఫెక్ట్స్ పనులు పెండింగ్‌లో ఉండటంతో మేకర్స్ కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ లేట్ తమన్నాకు ప్లస్ అవుతుందా? బాలీవుడ్ ట్రేడ్ లెక్కలు ఏం చెబుతున్నాయి? ఆ వివరాలు మీకోసం.

**సమ్మర్ రేస్ నుంచి అవుట్.. ఆగస్టులో ఎంట్రీ:**

తమన్నా ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'వ్వాన్' సినిమా విడుదల తేదీ మారింది. నిజానికి ఈ చిత్రాన్ని మే 15న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు, ముఖ్యంగా గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కాకపోవడంతో సినిమాను వాయిదా వేయక తప్పలేదు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆగస్టు 28న విడుదల కానుంది. రక్షాబంధన్ పండుగ వీకెండ్‌ను క్యాష్ చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ డేట్‌ను లాక్ చేసినట్లు తెలుస్తోంది. సమ్మర్ మిస్ అయినా, లాంగ్ వీకెండ్ కలెక్షన్లకు బాగా ప్లస్ అవుతుందని చిత్ర యూనిట్ భావిస్తోంది.







**తమన్నా ఆశలన్నీ 'వ్వాన్' మీదనే:**

ఒకప్పుడు సౌత్, నార్త్ అని తేడా లేకుండా వరుస సినిమాలతో బిజీగా ఉన్న తమన్నాకు ప్రస్తుతం సరైన హిట్ పడి చాలా కాలమైంది. ఇక హీరోయిన్‌గా అవకాశాలు తగ్గుతున్న తరుణంలో వెబ్ సిరీస్‌లు, స్పెషల్ సాంగ్స్‌తో బండి లాగిస్తున్న మిల్కీ బ్యూటీకి ఇప్పుడు ఒక సోలో హిట్ చాలా అవసరం. ఇక గతంలో చేసిన 'ఓదెల 2' ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఇప్పుడు ఈ అడవి నేపథ్యంలో సాగే ఫోక్ థ్రిల్లర్‌పైనే ఆమె ఫుల్ హోప్స్ పెట్టుకుంది. అనుష్కకు 'అరుంధతి' లాగా, ఈ సినిమా తన ఇమేజ్‌ను మారుస్తుందని ఆమె ఆశిస్తోంది.

**హారర్ జోనర్‌కు నార్త్‌లో విపరీతమైన క్రేజ్:**

ప్రస్తుతం బాలీవుడ్ మార్కెట్‌లో ఫోక్ హార్రర్ సినిమాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. రీసెంట్‌గా వచ్చిన 'స్త్రీ 2' వంటి చిత్రాలు రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు సృష్టించాయి. 'వ్వాన్' సినిమా కూడా అదే తరహాలో ఇంటెన్స్‌గా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఇక సిద్ధార్థ్ మల్హోత్రాకు ఉన్న ఫాలోయింగ్, దానికి తోడు మంచి కంటెంట్ తోడైతే ఈ సినిమా సుమారు రూ. 150 నుంచి 200 కోట్ల రేంజ్‌లో బిజినెస్ చేసే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కలు గనుక నిజమైతే తమన్నా మళ్ళీ టాప్ లీగ్‌లోకి వెళ్లడం ఖాయం.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com